ప్రజాశక్తి

సోమవారం 1 జులై 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

మరింత 'భరోసా'

- నేడు పెరిగిన పింఛన్లు పంపిణీకి సర్వం సిద్ధం
- ఇంటి వద్దే అందజేయనున్న సచివాలయ సిబ్బంది
- ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు వరకు పంపిణీ
- కృష్ణాజిల్లాలో 2,42,321 మంది లబ్ధిదారులు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా పెంచిన సామాజిక పింఛన్లు పంపిణీ చేయడానికి కృష్ణాజిల్లా యంత్రాంగం రంగం



సిద్ధం చేసింది. ఎన్‌టిఆర్ భరోసా పేరుతో సోమవారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఇంటి వద్దకే పింఛను తీసుకువచ్చి లబ్ధిదారులకు అందించనున్నారు. వివిధ కారణాలతో ఎక్కడన్నా మొదటి రోజు పింఛను అందుకోలేని లబ్ధిదారులకు రెండో రోజు మంగళవారం సచివాలయ సిబ్బంది పింఛను అందిస్తారు. కృష్ణాజిల్లాలో 2,42,321 మంది లబ్ధిదారులకు మే నెలలో రూ.71 కోట్ల 57 లక్షల 47 వేలు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు పింఛను మొత్తాన్ని పెంచడంతో జులై నెలలో 162 కోట్ల 42 లక్షలు పంపిణీ చేయనున్నారు.

కృష్ణాజిల్లాలోని 1,17,308 మంది వృద్ధులు, 59,349 మంది వితంతువులు, 4001 మంది చేనేత కార్మికులు, 7,817 మంది ఒంటరి మహిళలు, 35 మంది హిజ్రాలు, 3,275 మంది కల్లుగీత కార్మికులకు, 878 మంది డప్పు కళాకారులు, 120 మంది కళాకారులకు, 467 మంది చర్మకార వృత్తిదారులకు, 6,233 మంది మత్స్యకారులు గతంలో నెలకు మూడు వేలు పింఛన్ అందుకుంటున్నారు. ఇకపై వీరికి నాలుగు వేలు పింఛను అందిస్తారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏప్రిల్, మే, జూన్ (మిగతా 2లో)

ఎడతెరిపిలేని వర్షం

- మెట్ట పంటలకు జీవం
- కృష్ణాలో 908.8 మిల్లీ మీటర్లు నమోదు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, కంచికచర్ల

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎడతెరిపిలేని వర్షం కరుస్తోంది. దీతో మెట్ట పంటలకు జీవం పోసినట్లైంది. పత్తి, మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మొలకెత్తిన మొక్కల ఎదుగుదలకు ఢోకా ఉండదని రైతులు అంటున్నారు. ఈ ఏడాది జూన్ ఆరంభంలో చిరు జల్లులు కురిశాయి. వెంటనే రైతులు జూన్ మూడో వారంలో కురిసిన కొద్దిపాటి జల్లులకు (మిగతా 2లో)

విజయవాడ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

- వివిధ దశల్లో ప్రాజెక్టులు
- విఎంసి ఎస్ఇ (ప్రాజెక్ట్సు) రామమోహన్‌రావు

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ సమగ్రాభివృద్ధికి పలు ప్రణాళికలు సిద్ధం అవుతున్నట్లు నగరపాలక సంస్థ ఎస్ఇ (ప్రాజెక్ట్సు) కె.రామమోహన్‌రావు పేర్కొన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు వేగంగా జరిగేందుకు నగర కమిషనర్, మేయర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్ల తోడ్పాటు, ప్రజల సహకారం ఎంతో అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా విజయవాడలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు, వాటి పరిస్థితిపై ఆయన 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: విజయవాడలో చేపడుతున్న ప్రాజెక్టు పనుల తీరును వివరించగలరు?

విజయవాడలో సంక్షేమంతో పాటు పలు ప్రాజెక్టు పనులు (మిగతా 2లో)

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సాహితీ స్రవంతి బాధ్యులు సత్యాజీ

మోడీ పాలనలో భావప్రకటనా స్వేచ్ఛపై దాడి

- సమాజాన్ని మేల్కొలిపే కథలు, కవితలు, పాటలు మరిన్ని రావాలి
- సాహిత్య ప్రస్థానం ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి

మేడే-2024 సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఆదివారం జరిగింది. సాహిత్య ప్రస్థానం ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పలు కథా, పాటల సంకలనాలను ఆవిష్కరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వార్త మెయిన్‌లో

'క్షేత్రం' కథా సంకలనం ఆవిష్కరణ

'మాసిపోని మరకలు' కథా సంకలనం ఆవిష్కరణ

'దీపం' పాటల సంకలనం ఆవిష్కరణ

ఆహ్వానము

ప్రజాశక్తి

డాక్టర్స్ డే సందర్భంగా

ఉచిత మెగా వైద్య శిబిరం

మరియు

వైద్య రంగ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ

వేదిక : వాసవి కళ్యాణ మండపం, కృష్ణలంక, విజయవాడ.

తేది : 1-7-2024 సోమవారం ఉదయం 9 గంటలకు

సభాధ్యక్షులు : శ్రీ జి.శివరామకృష్ణ గారు, జనరల్ మేనేజర్, ప్రజాశక్తి

ముఖ్య అతిథులు :

డా॥ పి.రత్నావళి గారు, ప్రజారోగ్య విభాగఅధికారిణి, వి.ఎం.సి.,

శ్రీ డాక్టర్ జి.సమరం గారు, I.M.A. పూర్వ జాతీయ అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు

కా॥ బి.తులసీదాస్ గారు, ఎడిటర్, ప్రజాశక్తి

శ్రీ వై. అచ్యుతరావు గారు, చీఫ్ జనరల్ మేనేజర్, ప్రజాశక్తి.

శ్రీ డాక్టర్ మాకినేని కిరణ్ గారు, ప్రముఖ వాస్క్యులర్ సర్జన్.

కా॥ దోనేపూడి కాశీనాథ్ గారు, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

శ్రీ జి.రామమోహనరావు గారు, అదనపు ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ

శ్రీ ఎం.బి.నాథన్ గారు, కన్వీనర్, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజాశక్తి.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖలో
గత 40 సంవత్సరాలుగా వివిధ హోదాలలో
అంకిత భావంతో పని చేసి అందరి
మన్ననలను పొందిన
శ్రీమతి బందెల ధనలక్ష్మి గారు,
కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గా
కోడూరు పి.హెచ్.సిలో ఉద్యోగ విరమణ
చేయుచున్న సందర్భంగా
శ్రీ కొడాలి జయరావు - శ్రీమతి ధనలక్ష్మి గార్లకి
ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు...

శ్రీ కొడాలి జయరావు - శ్రీమతి ధనలక్ష్మి గార్లు

కుమారులు - కోడళ్లు
దినేష్ - సింధూజ
దిలీప్ - శ్రీ విద్య
దీపక్

మనుమరాళ్లు
దిసిజ్ఞ, హనన్య

విజయవాడలో 'బుజ్జి' సందడి

సెల్ఫీలు దిగేందుకు ఎగబడిన జనం

వార్త 2లో

కనీస పెన్షన్ సాధనకు చలో ఢిల్లీ

ఎపిఆర్‌పిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరాజు

ప్రజాశక్తి-విజయవాడ: జాతీయస్థాయిలో ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు డిఎ తో కలిపి చెల్లించాలని కోరుతూ ఆగస్టులో నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పెన్షనర్స్ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎపిఆర్‌పిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్తిరాజు, గౌరవాధ్యక్షులు పి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఎపిఆర్‌పిఎ కృష్ణా జిల్లా కమిటీ సమావేశం ఎపిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఎ శాస్త్రి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సత్తిరాజు, అజయ్‌కుమార్ మాట్లాడుతూ... ఆగస్టు 6, 7, 8 తేదీలలో ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద మూడు రోజులు పాటు జరిగే నిరసన కార్యక్రమంలో పెన్షనర్స్ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా 75 లక్షల మంది ఈపీఎఫ్ పెన్షనర్లు ఉన్నారనిఅన్నారు. అందులో 25 లక్షల మంది కనీసం వెయ్యి రూపాయలు పెన్షన్ కూడా పొందలేకపోతున్నారని అన్నారు. ఇటీవల అకాల మరణం చెందిన రాష్ట్ర కోశాధికారి సిహెచ్ సత్యనారాయణ రాజుకు మతికి ఈ సందర్భంగా సంతాపం తెలిపి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అందరికీ హైయర్ పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి పి శ్రీనివాసరావు, కోశాధికారి జివి రాజేశ్వరావు, నాయకులు ఎం ఉమామహేశ్వరరావు, మహమ్మద్ అన్సార్ ఎన్ కే దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-వన్‌టౌన్

విద్యాధరపురంలోని హెడ్ వాటర్ వర్క్స్ నందు ఉన్న 11 యం.జి.డి. క్లియర్ వాటర్ సంపును శుభ్రపరచవలసి ఉన్నందున ఈ నెల 1వ తేదీ సోమవారం ఉదయం 8 నుండి రాత్రి 11 గంటల వరకు నీటి సరఫరా నిలుపుదల చేయబడుతుందని సర్కిల్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలోని లారీ స్టాండ్, ప్రియదర్శిని కాలనీ, హెచ్‌బీ కాలనీ-1, హెచ్.బి. కాలనీ -2, రామరాజ్యనగర్, ఫోర్ పిల్లర్ సెంటర్, బ్రహ్మంగారి మఠం-1, బ్రహ్మం గారి మఠం -2, టేనర్ పేట, లంబాడీపేట కొండ ప్రాంతం, సొరంగం ప్రాంతం, ఊర్మిళా సుబ్బారావు నగర్, జక్కంపూడి హౌసింగ్ కాలనీ, గొల్లపాలెం గట్టు, చిట్టినగర్, ఫ్రైజర్ పేట, డైరెక్ట వాటర్ సప్లై ప్రాంతాలైన కెఎల్ రావు నగర్, సిండికేట్ బ్యాంకు కాలనీ, నాగమ్మ సత్రం, నైజాం గేట్, సౌమ్య థియేటర్ ప్రాంతం, ఫోర్‌మెన్ బంగ్లా, మిల్క్ ప్రాజెక్ట్ కొండ ప్రాంతం, వించిపేట, సితార, రామరాజ్యనగర్ బూస్టర్, ఏకలవ్యనగర్, వెలంపల్లి కాలనీ, ఐరన్ యార్డు, లక్ష్మీనగర్ కాలనీ, నులకపేట, దర్గా ఏరియా ప్రాంతాలలో సోమవారం సాయంత్రం నీటి సరఫరాకు అంతరాయం జరుగుతున్నందున ఆ ప్రాంత పరిధిలోని ప్రజలు తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని విఎంసి అధికారులు తెలిపారు.

విజయవాడలో 'బుజ్జి' సందడి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: 'బుజ్జి' పేరు వినగానే ఇంట్లో పిల్లలో లేక స్నేహితులో గుర్తుకు వచ్చేవారు. కానీ ఇప్పుడు బుజ్జి అనగానే సినీనటుడు ప్రభాస్ నటించిన కల్కి సినిమాలోని వాహనం కళ్ల ముందు కదలాడుతోంది. ఈ చిత్రంలో భైరవ ఎంత ఫేమసో ఆయనతో కలిసి సందడి చేసిన బుజ్జి కూడా అంత పాపులరైంది. విభిన్నమైన ఆకృతిలో ఉండే 'బుజ్జి' కారు విజయవాడలో ఆదివారం సందడి చేసింది. బెంజిసర్కిల్ వద్ద గల ట్రెండ్‌సెట్ మాల్‌లో ఉంచిన 'బుజ్జి'ని చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బుజ్జితో సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. బుజ్జిని తయారు చేసిన డిజైనర్ రమేష్ మాట్లాడుతూ... ఈ వాహనాన్ని మహేంద్ర జయం కంపెనీ తయారు చేసింది. రూ.7 కోట్ల ఖర్చుతో ఏఐ ఆధారితంగా రూపొందించాం. బుజ్జి వాహనం గంటకి నలభై కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఈ వాహనం మొత్తం బ్యాటరీపైనే నడుస్తుంది. మూడు టైర్లతో సుమారు ఆరున్నర టన్నుల బరువు ఉంటుంది. ఈ వాహనానికి ఉపయోగించిన చక్రాలను సియట్ కంపెనీ రూపొందించింది. ఈ వాహనం బరువు అధికంగా వెనక చక్రంపైనే ఉంటుంది. బ్యాటరీ ఫుల్ ఛార్జింగ్ పెడితే 50 కిలోమీటర్ల వరకు నడుస్తుంది అని రమేష్ తెలిపారు.

నేటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ఫిర్యాదులు అందజేయవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు జోనల్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు విజయవాడ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు.

'మత రాజ్యస్థాపనకు తెచ్చిన చట్టాలను వ్యతిరేకించండి'

ప్రజాశక్తి-విజయవాడ: దేశంలో మతరాజ్యం స్థాపనకు కేంద్రంలోని ఎన్‌డిఎ-మోడీ ప్రభుత్వం అప్రజాస్వామిక పద్దతిలో మూడు నూతన చట్టాలను తీసుకొచ్చిందని, వీటిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పియుసిఎల్ నాయకులు, సీనియర్ అడ్వకేట్ బండ్ల సాంబశివరావు పిలుపునిచ్చారు. ఉభయ తెలుగురాష్ట్రాల ఓపిడిఆర్ అధ్యక్షులు కుక్కల ఏసు ప్రథమ వర్ధంతి సభ స్థానిక బాలోత్సవ భవన్‌లో ఆదివారం జరిగింది. దీనికి ఓపిడిఆర్ ఉభయ తెలుగురాష్ట్రాల ప్రధాన కార్యదర్శి వి హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బండ్ల సాంబశివరావు మాట్లాడుతూ...పౌరులను పాలితులుగా, లౌకిక రాజ్యాన్ని మత రాజ్యాంగంగా మార్చడానికి మూడు న్యాయ చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. ఐపిసి, సిఆర్‌పిసి, భారత సాక్షి చట్టాలను మార్చివేసి అత్యంత అప్రజాస్వామిక పద్దతిలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధీనియం అని నామకరణం చేశారన్నారు. పార్లమెంట్‌లో వీటిపై కనీస చర్చ కూడా మోడీ ప్రభుత్వం జరగనీయలేదన్నారు. 140 మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి, వీటిని ఆమోదించేసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ అడ్వకేట్ ఎఎస్-ఎస్ రామ్ ప్రసాద్, ఒపిడిఆర్ రాష్ట్ర నాయకులు , అడ్వకేట్లు ఎస్ వెంకటేశ్వరరెడ్డి, జె పాపారావు, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు సి విజయ, రైతు కూలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యు వీరబాబు, ఆలిండియా ఓపిడిఆర్ చైర్మన్ సి భాస్కరావు తదితరులు పాల్గొన్నారు.ముందుగా ఏసు చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.

మొదటిపేజీ తరువాయి

మరింత 'భరోసా'

మూడు నెలలకు నెలకు వెయ్యి రూపాయలు కలిపి ఈ నెలలో ఏడు వేలు అందించనున్నారు. 34,355 మంది వికలాంగులకు జూన్ నెల వరకు మూడు వేలు పింఛను పంపిణీ చేయగా ఈ నెల నుంచి రూ.6 వేలు పింఛను అందించనున్నారు. 354 మంది కిడ్నీ బాధితులకు బాధపడుతున్న వారు ఇప్పటి వరకు నెలకు రూ.5 వేల పింఛను అందుకుంటున్నారు. వీరికి ఇకపై నెలనెలా రూ. 0 వేలు అందజేస్తారు. 1331 మంది ఇతర అనారోగ్యాలతో బాధపడుతూ పింఛను అందుకుంటున్న వారిలో పక్షవాతం,ఇతర వ్యాధులతో మంచానికి పరిమితమైన వారి పింఛను రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెరగనుంది.

ఎడతెరిపిలేని వర్షం

వర్షంపై ఆశతో మెట్ట పంటలు సాగుచేశారు. పెసర, మొక్కజొన్న, పత్తి విత్తనాలు నాటారు. ఆశించిన వర్షం కురవక పొలాల్లో తేమ శాతం చాలక వేసిన విత్తనాలు కొన్నిచోట్ల మొలకెత్తలేదు. దీంతో రైతులు వర్షం కోసం ఆకాశం వంక చూశారు. ఈ క్రమంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు ఆగకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఈ ముసురుకు మొలకెత్తిన పెసర, మొక్కజొన్న, పత్తి మొక్కలు పచ్చగా ఉన్నాయి. ఇంకా సాగుచేయని పొలాల్లో సోమవారం విత్తనాలు నాటేందుకు రైతులు సిద్ధమయ్యారు.

కృష్ణా అంతటా వర్షం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో శనివారం 8.30 గంటల నుంచి ఆదివారం 8.30 గంటల వరకు కృష్ణాజిల్లాలోని 25 మండలాల్లో 908.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున ఒక్కో మండలంలో 36.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. అత్యధికంగా కృత్తివెన్ను మండలంలో 72.2 మిల్లీ మీటర్లు, నందివాడలో 57.4, బంటుమిల్లిలో 54.2, పెదపారుపూడిలో 53.2, గుడివాడలో 48.2, పామర్రులో 46.2, నాగాయలంకలో 44.8, గుడ్లవల్లేరులో 44.8, వుయ్యూరులో 43.4, ఉంగుటూరులో 42.6, ఘంటసాలలో 41.8, పమిడిముక్కలలో 38.6, చల్లపల్లిలో 34.6, తోట్లవల్లూరులో 33.4, పెనమలూరులో 32.2, కంకిపాడులో 28.2, అవనిగడ్డలో 26.8, గన్నవరంలో 26.4, కోడూరులో 23.4. మచిలీపట్నంలో 21.6, మోపిదేవిలో 20.2, బాపులపాడులో 19.8, మొవ్వలో 18.8, గూడూరులో 18.2, అత్యల్పంగా పెడనలో 17.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

విజయవాడ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

ప్రారంభించడం జరుగుతుంది. ఇప్పటికే కొన్ని ప్రాజెక్టు పనులు జరుగుతుండగా, మరికొన్ని ప్రారంభించాల్సి ఉంది. నిధులు, వాటి లభ్యత, ప్రభుత్వ ప్రాధాన్యత కనుగుణంగా వీటిని చేపట్టడం జరుగుతుంది. విఎంసి సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రాజెక్టులను పూర్తి చేస్తాం.

ప్రశ్న: సింగ్‌నగర్ ఐకానిక్ పార్కు తీరును వివరించగలరు?

సింగ్‌నగర్ ఏరియాలోని ఆయా డివిజన్ల ప్రజలకు అహ్లాదాన్ని, వినోదాన్ని, చిన్నారులకు ఎంటర్‌టైన్‌మెంట్ ఎంతో ఉపయోగపడే ఈ ఐకానిక్ పార్కుకు నగరపాలక సంస్థతో పాటు నూతనంగా వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుంది. నిధులు కూడా సాధ్యమైన త్వరగా మంజూరు చేయించి, ఇంకా చేయాల్సిన వివిధ రకాల పనులను త్వరితిగతిన పూర్తి చేయడానికి నగర కమిషనర్, మేయర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్ల సహకారంతో కృషి చేయడం జరుగుతుంది. ఇప్పటికే కొంత వరకు పార్కు పనులు పూర్తి అయ్యాయి. సువిశాల పది ఎకరాల్లో ఎక్సెల్‌ప్లాంట్ ఎదురుగా ఈ పార్కు రూపుదిద్దుకోవడం జరుగుతుంది. పార్కులో పచ్చదనం (గ్రీనరీ) అభివృద్ధి, పిల్లలు ఆడుకునే పరికరాలు, వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం. సాధ్యమైన త్వరగా ఈ పార్కు పనులు ప్రారంభించడం జరుగుతుంది.

ప్రశ్న: అమృత్-2 పథకం క్రింద ఎస్‌టిపిల ఆధునీకరణ పనుల తీరుపై చెప్పగలరు?

అమృత్-2 స్కీమ్ కింద సింగ్‌నగర్, జక్కంపూడి ప్రాంతాల్లో నాలుగు సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్(ఎస్‌టిపి)ను ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. వీటికి రూ.70 కోట్లు అమృత్ పథకం నిధులను వెచ్చించడం జరుగుతుంది. గత 2023 నవంబర్‌లో ఈ పనులు ప్రారంభించడం జరిగింది.

ప్రశ్న: పనుల ముఖ్య ఉద్దేశం వివరించగలరు?

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం బయాలజికల్ ఆక్సిరేషన్ డిమాండ్ (బిఒడి) 30 శాతం (మిలియన్ గ్రామ్స్- ఫర్ లీటర్) నుంచి పది శాతం లోపుకు తగ్గించే విధంగా యుజిడి నుంచి వచ్చే మల, మూత్ర వ్యర్థాల నీటిని ట్రీట్‌మెంట్ చేయాలి. ట్రీట్‌మెంట్ చేసిన అనంతరం ఆ నీటిని డ్రైయినేజీల ద్వారా బుడమేరులోకి మళ్లించాలి. దీని వల్ల వాతావరణం కాలుష్యాన్ని తగ్గించవచ్చు. నగర వ్యాప్తంగా రోజుకు సుమారు 70 (మిలియన్ లీటర్స్ ఫర్ డే) ఎంఎల్‌డి నీరు ఎస్‌టిపిలకు చేరుతుంది. వాటిని గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం శుద్ధి చేయాలి.

ప్రశ్న: ఎయిర్ క్వాలిటీ ఇంప్రువ్‌మెంట్ కింద కెనాల్ బ్యూటిఫికేషన్ పనుల ఎలా జరుగుతున్నాయి?

15వ ఆర్థిక సంఘం నిధులతో ఎయిర్ క్వాలిటీ ఇంప్రువ్‌మెంట్ కింద పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రధానంగా నగరంలో గుండా ప్రవహిస్తున్న బందర్, ఏలూరు, రైవస్ కెనాల్స్ బ్యూటిఫికేషన్ పనులను రూ.3 కోట్లతో చేయించాలి. ఒక్కొక్క కెనాల్ నగర పరిధిలో ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల కాలువల పొడవునా ఈ పనులు చేపట్టాల్సి ఉంటుంది. గ్రీనరీ అభివృద్ధి, కెనాల్స్ బండ్స్ పటిష్టపరచడం, వ్యర్థాల తొలగింపు పనులను ఆరు మాసాల్లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. కెనాల్స్ పరిధిలో కాలుష్య రహితంగా వాతావరణం ఉండే విధంగా ఈ పనులు చేయించడం జరుగుతుంది.

ప్రశ్న: ఇళ్లల్లో నుంచి వచ్చే వ్యర్థాలు కెనాల్స్‌లో కలవకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

వాతావరణ కాలుష్య నివారణతో పాటు కెనాల్స్ పరిశుభ్రంగా ఉంచటానికి అమృత్-2 స్కీమ్ కింద రూ. ఎనిమిది కోట్లతో ఈ పనులు చేపట్టడం జరుగుతుంది. ప్రధానంగా ఇళ్లల్లో నుంచి వచ్చే వ్యర్థాలు, మురుగునీరు కెనాల్స్‌లోకి వెళ్ల కుండా ప్రత్యేకంగా కెనాల్స్ పరిధిలోనే ప్రత్యేకంగా సంప్‌లు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి డ్రైయిన్ల ద్వారా ఎస్‌టిపిలకు మురుగునీటిని పంపించడం జరుగుతుంది. నగరం పరిధిలో ఈ పనులను అర్బన్ గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ విభాగం చేపట్టడం జరుగుతుంది. రోజుకు రెండు నుంచి మూడు ఎంఎల్‌డి వాటర్ ఎస్‌టిపిలకు మళ్లించడం ద్వారా కొంత వాతావరణం కాలుష్యం కాకుండా నివారించడం జరుగుతుంది.

ప్రశ్న: కబేళా ఆధునీకరణ పనుల పరిస్థితేంటి?

ఈ పనులకు సంబంధించి అంచనాలు తయారు చేయడం గతంలోనే జరిగింది. ఆధునిక టెక్నాలజీతో ఇతర రాష్ట్రాల్లో నడుస్తున్న కబేళాల పరిస్తితిపై కూడా పరిశీలించడం జరిగింది. నగర పరిధిలో కబేళాకు వచ్చే వివిధ రకాల పశువులను టెక్నాలజీ సాయంతో సునాయాసంగా కటింగ్ చేసి, వాటి ద్వారా వచ్చే మాంసం, ఇతర వ్యర్థాలు, వాటిని సులువైన పద్దతుల్లో సేకరించడం జరుగుతుంది. రూ. మూడు కోట్ల జనరల్ నిధులతో ఈ కబేళా ఆధునీకరణ చేపట్టడం జరుగుతుంది. అందరికీ అందుబాటులో ఉండే విధంగా, పొల్యూషన్ కాకుండా అన్ని విధాలుగా బాగుండటానికి దీనిని ఆధునీకరించాం.

చక్కని చేతిరాతతో ఆత్మవిశ్వాసం : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : మంచి చేతిరాత విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. చేతిరాత శిక్షణ తరగతులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేసారు.జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రోత్సాహంతో అమ్మఒడి హ్యాండ్ రైటింగ్ ఇన్స్టిట్యూట్ విజయవాడ వారి ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని ఎస్ వి పబ్లిక్ స్కూల్లో 835 మంది విద్యార్థులు, పామర్రులో ఉషోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 120 మంది 1 నుండి 10 తరగతుల విద్యార్థులకు మే నెలలో ఉచిత చేతివ్రాత శిక్షణ తరగతులు నిర్వహించగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 150 మంది విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. విద్యార్థుల చేతివ్రాత ప్రతులను ఆయన స్వయంగా పరిశీలించి, తక్కువ వ్యవధిలోనే అభివద్ధి చేసుకున్నారని విద్యార్థులతో పాటు శిక్షకులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలవిద్య దశలోనే విద్యార్థులు మంచి చేతిరాతను అభివద్ధి చేసుకోవాలని, తద్వారా మంచి మార్కులు పొందేందుకు బాటలు ఏర్పరచుకోవాలన్నారు. చేతిరాత వేగంగా రాయడంతో పాటు అర్థవంతంగా, ఆకర్షణీయంగా ఉండాలని సూచించారు. కేవలం 15 రోజుల్లో మంచి చేతిరాతను అభివద్ధి చేసుకున్నారని, ఇదే స్ఫూర్తితో ఇతర అంశాలను నేర్చుకోవాలని సూచించారు. తాను ఐఏఎస్ గా రాణించడానికి మంచి చేతిరాతే గొప్ప విజయాన్ని అందించిందని నాటి జ్ఞాపకాలను ఆయన గుర్తు చేసుకున్నారు. జిల్లా విద్యా శాఖాధికారిణి తాహెరా సుల్తానా, అమ్మఒడి హ్యాండ్ రైటింగ్ ఇన్స్టిట్యూట్ నిపుణులు భువనచంద్ర పాల్గొన్నారు.

విద్యార్థినీలకు జ్ఞాపికలు అందిస్తున్న దృశ్యం

వేణుకుమార్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మైత్రి వేణుకుమార్ సేవలు అనన్య సామాన్యమని, బెల్ కంపెనీలో ఉన్నతోద్యోగిగా ఆదివారం పదవీ విరమణ చేస్తున్న కేసాని వేణుకుమార్ సేవల్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథరావు (బుల్లయ్య) కొనియాడారు. వేణు కుమార్ మైత్రి ఫౌండేషన్ ద్వారా గత రెండు సంవత్సరాలుగా పేదల, అన్నార్తుల, వద్ధుల, వికలాంగుల, పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తూ మైత్రి ఫౌండేషన్ సంస్థకు అధ్యక్షులుగా కొనసాగు తున్నారని అన్నారు. మైత్రి సంస్థ ద్వారా ఇప్పటికీ గడచిన రెండు సంవత్సరాలలో 400 ఈవెంట్లు పూర్తి చేశారని ఇది సామాన్యమైన విషయం కాదని అన్నారు. అనంతరం బెల్ కంపెనీ ఉద్యోగులు, మైత్రి ఫౌండేషన్ కుటుంబ సభ్యులు వేణు కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బెల్ కంపెనీ అడిషనల్ జనరల్ మేనేజర్ సురేష్ బాబు, స్టార్ కాలేజ్ డైరెక్టర్, శ్రీరామ్ యోగా గురువు శ్రీనివాసరావు, మైత్రి రాధా కష్ణ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు

- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : శిధిలావస్థకు చేరిన డా.బిఆర్ అంబేద్కర్ భవనం స్థానంలో పేద ప్రజలకు ఉపయోగపడేలా మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి జిల్లా కోర్టు సెంటర్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనాన్ని సందర్శించి పరిశీలించారు. భవనం లోపల కలియతిరిగి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. భవన నిర్మాణానికి అవసరమైన అంచనాలను రూపొందించాలని సాంఘిక సంక్షేమ శాఖ ఉపసం చాలకులకు సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా కేంద్రం మచిలీపట్నంలోని జిల్లా కోర్టు సెంటర్ సమీపంలో 25 సంవత్సరాల క్రితం నిర్మించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం నేడు శిథిలావస్థకు చేరుకుందని, దాని స్థానంలో అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామన్నారు. ఈ భవనంలో సమావేశాలు, ఫంక్షన్లు, గ్రంథాలయం, స్టడీ సర్కిల్, పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసి అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా త్వరలో నిర్మిస్తామన్నారు. ఈ పర్యటనలో జన సేన నియోజక వర్గ ఇంఛార్జి బండి రామకష్ణ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యం, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు షాహిద్ బాబు, పలు దళిత సంఘాల నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-కంకిపాడు : కడుపునొప్పి తాళలేక వివాహిత మృతిచెందిన సంఘటన కంకిపాడు గ్రామంలోకి మంతెన గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం మంతెన గ్రామానికి చెందిన తిరువీధుల జోజీ రాణి కుమార్తె తిరువీధుల ఆశను గన్నవరంకు చెందిన లక్ష్మీకాంతన్నకు ఇచ్చి ఆరు నెలల క్రితం వివాహం చేశారు. ఆశకు ఆరోగ్యం బాగోలేక పుట్టింటికి వచ్చింది. తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.కంకిపాడు ఎస్సై 2 తాతాచార్యులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సహాయం అందజేస్తున్న శ్రీనివాస్ సోదరుడు తదితరులు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ శివారు కొత్తపేట గ్రామంలో శుక్రవారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లో గహం దగ్ధమైన కుటుంబ సభ్యులు వినయ్ కుమార్కుటుంబానికి ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కు ర్తి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు విక్కు ర్తి వీర రాఘవయ్య ట్రస్టు తరపున ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని శ్రీనివాస్ సోదరుడు రాంబాబు సందర్శించి రూ 5000 నగదు బియ్యం నిత్యవసర సరుకులు ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన భూపతి నాంచారయ్య, పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీనివాసరావు, వ రే బసవరావ్ పున్నయ్య చౌదరి బర్మా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కన్నీరు పెట్టిస్తోన్న ఉల్లి ధరలు

ప్రజాశక్తి - గన్నవరం : ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదనే సామెతకు ధరల పోటు తగిలింది. వినియోగదారులను కంట తడి పెట్టిస్తోంది. ప్రస్తుతం కిలో రూ.50 చేరుకుంది. వారం రోజుల్లో వాటి ధరలు మరింత పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. హెూల్సేల్ షాపులో ఉల్లి కిలో రూ.40 కాగా, బహిరంగ దుకాణాల్లో రూ.50 పలుకుతోంది. సామాన్యులు కొనడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఉల్లి పాయలు లేనిదే ఏ వంటలు రుచిగా ఉండ వు. ధరల దెబ్బకు వాటిని కొనలేక రుచిగా లేని వంటలు తినే పరిస్థితి పేదల్లో నెలకొంది. మహారాష్ట్ర నుంచి ఉల్లి దిగుమతి ఆగింది. నాశిక్, తాడేపల్లి గూడెం మార్కెట్లో ఉల్లి నిల్వలు పడిపోయాయి. దీంతో గన్నవరం మార్కెట్లో ఉల్లిపాయలు కొనకుండానే కంట తడిపెట్టిస్తున్నాయని మహిళలు చెబుతున్నారు. చిల్లర దుకాణాల్లో ఉల్లిపాయ ఒకటి ఐదు రూపాయలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం రంగంలోకి దిగి ఉల్లి పాయలను రైతు బజార్ ద్వారా విక్రయించాలని కోరుతున్నారు.

ఉల్లి వ్యాపారం తగ్గింది

గోపిశెట్టి వీరాస్వామి. హెూల్ సెల్ వ్యాపారి,

ఉల్లిపాయలు ధర కేజీ రూ.45 ఉంది. మరో వారం రోజుల్లో 70కి చేరి నా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. ఎంద కంటే మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలో ఉల్లి దిగుమతి ఆగింది. దీంతో రేట్లు పెరిగాయి.

టిడ్కో కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం : వెనిగండ్ల

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ టిడ్కో లే అవుట్లో సమస్యలు పరిష్కరించి అద్భుత కాలనీగా అభివద్ధి చేస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం గుడివాడ టిడ్కో కాలనీలో మున్సిపల్, టిడ్కో అధికారులతో కలిసి ఎమ్మెల్యే రాము పర్యటించారు. ముందుగా కాలనీలో ప్రధాన డ్రైనేజీ ఎండింగ్ పాయింట్ ను పరిశీలించి మురుగు బయటకు పోయే మార్గం లేకపోవడంతో సమీపంలోని మురుగు కాల్వ ద్వారా టిడ్కో కాలనీ డ్రైనేజీ మురుగు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కాలనీలో అపరిశుభ్ర వాతావరణాన్ని పరిశీలించి ఎక్కడికక్కడ రోడ్లపై ఉన్న చెత్తను తొలగించాలని అధికారులకు సూచించారు. త్వరలో టిడ్కో ప్లాట్ల రుణమాఫీపై ప్రకటన వస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టిడ్కో కాలనీ ప్రధాన సెంటర్ వద్దకు వేలాదిగా వచ్చిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే రాము మాట్లాడారు. లబ్ధిదారులు చెప్పిన సమస్యలన్నీ రాము సావధానంగా విన్నారు. సమస్యల పరిష్కారానికి తామంత చేస్తున్న కషిలో లబ్ధిదారులు కూడా భాగస్వామ్యం కావాలని అన్నారు. ప్రధానంగా పురపాలక సంఘం ఏర్పాటు చేసే డంపర్ బాక్సుల్లోనే ప్రతి ఒక్కరు చెత్త వెయ్యాలని సూచించారు. మూడు నెలల్లో ప్రజల తాగునీటి సమస్యలు పరిష్కరించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీ వాసు లతో కలిసి ఎమ్మెల్యే రాము మొక్కలు నాటారు. అనంతరం టిడ్కో కార్యాల యంలో మున్సిపల్, టిడ్కో అధికారులు టిడ్కో ఏజెన్సీ ప్రతినిధులతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. టిడ్కో కాలనీ నమూనా డెమో నిర్మాణాలను పరిశీలించిన రాము ఇప్పటివరకు జరిగిన అభివద్ధి పనులు జరగాల్సిన పనుల నివేదికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రమణ్యం, టిడ్కో ఎస్ఇ బి.చిన్నోడు, మున్సిపల్ ఈఈ విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతారామయ్య

నూతన కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - నందిగామ : లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నందిగామలో జరిగింది. పేట రామకృష్ణ ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నందిగామ అధ్యక్షులుగా మందడపు సీతారామయ్య, కార్యదర్శి డాక్టర్ కె.లక్ష్మీకాంత్, కోశాధికారి మాలెంపాటి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కౌన్సిల్ చైర్మన్ డి.శాంతి ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడు మాట్లాడుతూ 2024-25 సంవత్సరకాలం పేద ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు చేస్తామని లయన్స్ క్లబ్ విధివిధానాలను అనుసరించి సర్వీస్ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లయన్ ఎర్రం రెడ్డి గాంధీ, లయన్ తొర్లికొండ సీతారామయ్య, పులిపాటి శ్రీనివాస్. కాపారవీంద్రనాథ్ గోపు సుబ్రహ్మణ్యం, రామిరెడ్డి శ్రీధర్ తదితర లయన్స్ సభ్యులందరూ పాల్గొన్నారు.

అల్పాహారం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : రాష్ట్రంలో కూటమి మైలవరంలో వసంత వెంకటకృష్ణ ప్రసాద్ విజయం సాధించడంతో కొండపల్లికి చెందిన టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు విజయవాడలోని దుర్గమ్మ ఆలయానికి బోనాలతో మొక్కు చెల్లించేందుకు బయలుదేరారు. వీరు ఇబ్రహీంపట్నం సెంటర్‌కు చేరుకోగానే ఎంపిపి పాలడుగు జోత్స్న టిడిపి నాయకులు దుర్గాప్రసాద్ స్వాగతం పలికి తమ కార్యాలయంలో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకురాలు చిలుకూరి విజయ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే అమ్మవారికి బోనాలు సమర్పిస్తామని మొక్కుకున్నామని అందుకే ఈ బోనాలు సమర్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర నాయకులు విజయతో పాటు తన్నీరు రమాదేవి, సంఘవరపు సుధారాణి, కర్రీ అనిత, కారుమంచి జ్యోతి తదితరులు కొండపల్లి నుండి దుర్గ గుడికి వెళుతున్న సందర్భంగా వారికి అల్పాహార విందు ఏర్పాటు చేశామని, టిడిపి కార్యకర్తలు చేసే ప్రతి పనిలోనూ తమ వంతు సహకారం అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధమని పాలడుగు జోత్స్న తెలిపారు. మూలపాడు, తుమ్మలపాలెం గ్రామాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

2 అతిసార కేసులు నమోదు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :
జగ్గయ్యపేట ప్రాంతంలో ఆదివారం కొత్తగా 2 డయేరియా కేసులు నమోదు అయినట్లు బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. వీరిలో వత్సవాయి మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన వేముల రాంబాబు, చిల్లకల్లు గ్రామానికి చెందిన కోలికపోగు వినోద్ డయేరియా బారిన పడ్డారు. ప్రస్తుతం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో 4 డయేరియా కేసులు ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా కేసులు 120 నమోదు అయ్యాయని, వీటిలో 100 కేసులు వివిధ హాస్పటల్ నుండి చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారని, మరో 11 కేసులు విజయవాడ జిజిహెచ్‌కి పంపించామని, ప్రస్తుతం డయేరియా తగ్గుముఖం పట్టిందని తెలిపారు. ప్రజలు డయేరియా పట్ల అవగాహన కలిగి ఉండాలి, నీళ్లను మరగబెట్టి చల్లార్చిన నీటిని తాగాలని, భోజనానికి ముందు, బహిర్భూమికి వెళ్లి వచ్చిన తర్వాత చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు.

చికిత్స పొందుతున్న డయేరియా రోగులు

సేవా దృక్పథంతో సిటీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు

స్వాతి డయగ్నోస్టిక్స్ ల్యాబ్, స్కాన్, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లెల సబితా శివప్రసాద్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :
సేవా దృక్పథంతో జగ్గయ్యపేటలో సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు చేసేందుకు వైద్యరంగంలోకి వచ్చినట్లు స్వాతి డయగ్నోస్టిక్, ల్యాబ్, స్కాన్, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లెల సబితా శివప్రసాద్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సబితా శివప్రసాద్ మాట్లాడారు. జులై ఒకటవ తేదీ డాక్టర్స్ డే సందర్భంగా గతంలో తమ స్వాతి డయగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలో 100 మందికి ఈసీజీ, కిడ్నీ, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించామని తెలిపారు. ప్రతి సంవత్సరం డాక్టర్స్ డే సందర్భంగా ఏదో ఒక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలు తన తండ్రి భూపాలరావు స్ఫూర్తితో చేస్తున్నట్లు తెలిపారు. తాను రాజకీయ కుటుంబం నుండి వచ్చినప్పటికీ తనకు రాజకీయాలతో సంబంధం లేదని ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా వైద్యం రంగంలోకి వచ్చినట్లు తెలిపారు. గతంలో మార్చి 8 మహిళా దినోత్సవ సందర్భంగా 200 మంది మహిళలకు ఉచితంగా రక్త పరీక్షలు చేసినట్లు తెలిపారు. నలుగురు అంగవైకల్యం గల పిల్లలను దత్తత తీసుకొని వారి బాగోగులు చూస్తున్నట్లు తెలిపారు. తమ ల్యాబ్‌కు రక్త పరీక్షలు నిమిత్తం వచ్చే వృద్ధులకు ఫీజు తక్కువ తీసుకుంటున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో హెచ్ఆర్ సిటీ స్కాన్ విషయంలో ప్రతి రోగి వద్ద నుండి 40 శాతం తక్కువ ధరకే స్కాన్ చేశామని, తమ ల్యాబ్‌లో ప్రతి రక్త పరక్ష మిషన్‌పై పరీక్ష చేసి నిజాయి తీగా కంప్యూటర్‌లో ఫలితాలు ఇస్తున్నట్లు తెలిపారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుంటు న్నారని, మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించి నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు.

కష్టపడితే ఫలితం దానంతట అదే వస్తుందని 2002లో స్వాతి ల్యాబ్‌ను రామయ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చిన్న గదిలో నలుగురు సిబ్బందితో ప్రారంభించామని, ప్రస్తుతం ఈ ల్యాబ్ లో 50 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం సంతోషదాయకం అన్నారు. 2021లో జగ్గయ్యపేటలో మొట్టమొదటిగా తమ స్వాతి ల్యాబ్ లో సిటి స్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ ను ప్రారంభించామని, గతంలో ఈ పరీక్షకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని ప్రస్తుతం తమ ల్యాబ్ లోనే ఈ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ రేడియోలజిస్ట్ డాక్టర్ సునీల్ కుమార్ 24 గంటలు ఎప్పుడు అందుబాటులో ఉంటారని రానున్న కాలంలో తమ ల్యాబ్ ను మరింత విస్తరించడంతోపాటు కొత్త బ్రాంచీలను ప్రారంభించి ప్రజలకు మరిన్ని సేవలు చేస్తామని తెలిపారు.

విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గౌరవరం గ్రామంలో విద్యుత్ షాక్‌తో భర్త మృతి చెందగా భర్తను కాపాడబోయి భార్య, కూతురికి సైతం స్వల్పంగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వివరాల్లోకెళ్తే గ్రామానికి చెందిన జెర్రిపోతుల జాకోబ్ (50) ఉదయాన్నే లేచి బాత్రూంకి వెళ్తుండగా బాత్రూం డోర్‌కి ఇంట్లో గల విద్యుత్ తీగలు తాకటంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. దీంతో భార్య వజ్రమ్మ, కూతురు శాంతి ప్రియాలు జాకోబ్‌ను కాపాడుటకు ప్రయత్నించగా వారు సైతం స్వల్పంగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. విద్యుత్ షాక్ విషయాన్ని గమనించిన మృతుని అన్న ఆనందరావు హుటాహుటిన ఇంట్లో గల విద్యుత్ ఫీజులు తీసేసాడు. జాకోబును హుటాహుటిన జగ్గయ్యపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని కుమార్తె శాంతి ప్రియ ఫిర్యాదు మేరకు చిల్లకల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను ఆస్పత్రిలో ఉన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వర్షాకాలం అయినందున తరచూ విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని కావున ప్రజలందరూ విద్యుత్తు పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉదయభాను సూచించారు.

పల్లాకు సత్కారం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : టిడిపి రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా నియమితులైన పల్లా శ్రీనివాసరావు ఆదివారం గుంటుపల్లి వచ్చారు. ఈ సందర్భంగా మైలవరం నియోజకవర్గ ముస్లిం మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం పల్లా శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యేను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

ప్రజాశక్తి - భవానీపురం :
విద్యను అభ్యసించే వారిని ప్రోత్సహించాలని సముద్రాల పుల్లారావు పేర్కొన్నారు. ఆదివారం విద్యాధరపురం టీవీ కృష్ణారావు వీధిలో శృతి నిలయం సముద్రాల పుల్లారావు మనమరాలు పుట్టినరోజు సందర్భంగా యూఎస్ఏ నుంచి వచ్చి 15 మందికి విద్యా కానుకగా రూ.4 వేలు చొప్పున విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. వారికి శ్రీరామ వాసవి సేవా సమితి కమిటీ సభ్యులు అందరూ ధన్యవాదాలు తెలిపారు. నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పల్లవికి కృతజ్ఞతలు తెలియజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం రాష్ట్ర పోలీస్ శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డి.జి.పి.) ద్వారకా తిరుమలరావు కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఆలయానికి విచ్చేశారు. గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్ ఆదివారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

రేపటి నుండి యోగా క్లాసులు ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రైతు పేట సీఎం రోడ్డు రావూరి కాంప్లెక్స్ - 2లో ఏర్పాటు చేసిన యూనివర్సల్ యోగా సెంటర్‌లో జూలై - 2వ తారీఖు మంగళవారం నుండి యోగా క్లాసులు ప్రారంభమవుతాయని యోగా గురూజీ గాడిపర్తి సీతారామారావు ఆదివారం విలేకరులకు తెలిపారు.

12 నుండి పోలేరమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి- భవానీపురం : స్థానిక భవానీపురం ఊర్మిళా సుబ్బారావు నగర్‌లోని గ్రామదేవత పోలేరమ్మ తిరునాళ్లు జూలై 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు పోలేరమ్మ దేవస్థానం కమిటీ అధ్యక్షులు సూరసాని రామిరెడ్డి చెప్పారు. ఆదివారం పోలేరమ్మ దేవస్థానంలో తిరునాళ్లకు సంబంధించిన కరపత్రాలను దేవస్థానం కమిటీ వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి మాట్లాడుతూ గత 37 సంవత్సరాలుగా పోలేరమ్మ తిరుణాళ్లను నిర్వహిస్తూ వస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. పోలేరమ్మ దేవస్థానంలో రేకుల షెడ్డు స్థానంలో స్లాబ్ వేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. దసరా కల్లా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. కావున స్లాబ్ నిర్మాణానికి దాతలు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ కార్యదర్శి గుత్తావళి విజయబాబు, తుమ్మా తిరుపతిరెడ్డి, దొడ్డా వెంకటేశ్వర రెడ్డి, రాచమల్ల రమణమ్మ, గొందేసి సత్యనారాయణ రెడ్డి, గోపాదబాబు, ప్రధానార్చకులు గంటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సూరసాని రామిరెడ్డి తదితరులు

యాడ్ బ్లూ మొబైల్ వాహనం ప్రారంభం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : వాహనాల నుంచి వెలువడే కాలుష్య నియంత్రణకు ఎకో బ్లూ ట్రేడ్ మార్క్ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్‌ను వినియోగించాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు సూచించారు. ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం గ్రామంలో ఎకో బ్లూ ట్రేడ్ మార్క్ యాడ్ బ్లూ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ (డి.ఇ.ఎఫ్) మొబైల్ వాహనాన్ని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ వారి వాహనాల్లో డి.ఇ.ఎఫ్ ద్రావణాన్ని వినియోగించాలని కోరారు. వాహనాల నుంచి వెలువడే నైట్రోజన్ ఆక్సైడ్స్ (ఎన్.ఒ.ఎక్స్) వల్ల వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. వాహనం నుంచి కాలుష్యం వెదజల్లే ఎస్.సి.ఆర్ (సెలెక్టివ్ క్యాటిలైట్ రిడక్షన్) వద్ద డి.ఇ.ఎఫ్ ద్రావణాన్ని స్ప్రే చేయడంతో నైట్రోజన్ ఆక్సైడ్స్ అనే విషవాయువు వాటర్ వ్యాపర్, నైట్రోజన్ గా విడిపోయి కాలుష్యం చాలావరకు తగ్గిపోతుంది. వాహన చోదకులు డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్‌ను వినియోగించి వాయు కాలుష్యాన్ని నియంత్రించాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ఆకాంక్షించారు. స్థానిక ఎన్డీఏ మహాకూటమి నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నీటి సప్లై ఛానల్ అభివృద్ధికి శ్రీకారం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణంలోని ఏడు చెరువులకు నీళ్ల వచ్చే రాకెట్ సప్లై ఛానల్ అభివృద్ధికి ఎమ్మెల్యే కొడుకుపూడి శ్రీనివాసరావు శనివారం శ్రీకారం చుట్టారు. తన సొంత సొమ్ముతో నిధులతో రాకెట్ సప్లై కాలువ పూడిక తీత పనులను చేయిస్తున్నారు. సరిహద్దు ఖమ్మం జిల్లా, కలూరు మండలం, గుట్టపాడు నుండి సుమారు 7 కిలో మీటర్లు వరకు ఉన్న రాకెట్ సప్లయ్ ఛానల్ పూడికతో నిండి ఉండటంతో దాని పరిధిలోని ఏడు చెరువులకు నీటి సరఫరా పూర్తి స్థాయిలో రాకపోవడంతో చెరువు ల్లో నీటి కొరత ఏర్పడుతుంది. ఈ విషయాన్ని రైతుల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు.

వార్షికోత్సవ మహోత్సవాలు

ప్రజాశక్తి - నందిగామ :
నందిగామ మండలం కేతవీరునిపాడులో ఆదివారం సిఎస్ఐ పరిశుద్ధ పౌలు దేవాలయ మొదటి వార్షికోత్సవ మహోత్సవ వేడుకలు ఆదివారం జరిగాయి. నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఆలయ ప్రతిష్టాపకులు కృష్ణా గోదావరి అధ్యక్ష ఖండ బిషప్ తండ్రి ది రైట్ రెవ.డా.తంటేపూడి జార్జి కొర్నేలియాస్, స్త్రీల మైత్రి అధ్యక్షురాలు, డాక్టర్ బి జాషువా కుమారి తల్లితో కలిసి తంగిరాల సౌమ్య సిఎస్ఐ పరిశుద్ధ పౌలు దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక నేతలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాచవరంలో...

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం కాచవరం గ్రామంలో ఉన్న శ్రీ సీతా లక్ష్మణ హనుమాన్ సమేత శ్రీ కోదండరామ చంద్ర స్వామి దేవస్థాన ప్రథమ వార్షిక మహోత్సవాలు కన్నులపండువగా జరిగాయి. దేవాలయ కమిటీ ఆహ్వానం మేరకు దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. మూడవ రోజైన ఆదివారం నాడు స్వామివారి కల్యాణం, పూర్ణాహుతి, హోమం తదితర పూజా కార్యక్ర మాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే స్వామిని దర్శిం చుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులను అభినందించారు.

ఎంత ఎదిగినా ఒదిగిన మాణిక్యాలరావు

• అభినందన సభలో వక్తలు

మాణిక్యాలరావు దంపతులను సన్మానిస్తున్న కేఎస్ లక్ష్మణరావు, తదితరులు

ప్రజాశక్తి-గన్నవరం : జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగిన వారికే ప్రజలలో, సంఘంలో గుర్తింపు వస్తుందని, అలాంటి గుర్తింపు పొందిన వారిలో కొంగా మాణిక్యాలరావు ఒకరని చెప్పడంలో అతిశయోక్తి లేదని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం గన్నవరం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఎస్ఎ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు కే. మాణిక్యాలరావు ఉద్యోగ విరమణ సందర్భంగా రాయ నగర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అభినందన సభకు మాజీ ఎమ్మెల్సీ బి. నాగేశ్వరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కేఎస్. లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్ బాబు, యుటిఎఫ్ కోశాధికారి మరీదు వరప్రసాద్, బాపులపాడు ఎంఈఓ సురేష్ కుమార్, ఉంగుటూరు ఎంఈఓ సాంబశివరావు, మాజీ ఎంఈఓ జయబాబు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు గొట్టం రవిబాబు, నాయకులు ప్రసాద్, బాలోత్సవం నాయకులు గన్నె వెంకట్రావు, క్రొ వరప్రసాద్, సామాజిక వేత్త డాక్టర్ మద్దుకూరి విజయ్ కుమార్, వికెఆర్ కళాశాల మాజీ అధ్యాపకులు టివి. సుబ్బారావు, గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఝాన్సీ లక్ష్మి, ఆత్కూరు జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం కెవిబికె. సుధాకర్, రిటైర్డ్ పి. ఇ. టి. టిఎస్ఆర్కే ప్రసాద్, పిల్లల తల్లిదండ్రులు మాణిక్యాలరావు దంపతులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మెమొంటోతో సత్కరించారు. మాణిక్యాలరావు గురువులకు సత్కారం చేశారు. అనంతరం లక్ష్మణరావు, వక్తలు.. మాట్లాడుతూ ఉపాధ్యాయ వత్తికి మణిహారం మాణిక్యాలరావు అని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. సైన్స్ ప్రయోగాలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శించి అనేక ఉత్తమ అవార్డులు అందు కున్నారని తెలిపారు. బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని, విద్య అందరికీ అందాలని తపించి, పాఠశాలలో పిల్లలను పవిత్రంగా తీర్చిదిద్ది ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య వారధిగా పనిచేసిన మాణిక్యాలరావుకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. మాణిక్యాలరావు మాట్లాడుతూ.. 34 ఏళ్ల పాటు దీర్ఘంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసి ఎంతోమంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ఉద్యోగ విరమణ తర్వాత రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై పని చేసేందుకు కషి చేస్తామన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు మాణిక్యాలరావును గజమాలతో సత్కరించారు. గొల్లనపల్లి హైస్కూల్ హెచ్ఎం. జగదీశ్వరరావు కార్యక్రమం సంధాన కర్తగా వ్యవహరించారు.

దుస్తులు కుట్టడానికి కొటేషన్ దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కష్ణాజిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెట్రిక్ పూర్వ వసతి గహంలో నివసించుచున్న విద్యార్థిని/ విద్యార్థుల కొరకు 2024-25 విద్యా సంవత్సరంలో 1250 జతలకు ప్రభుత్వం వారు నిర్ణయించిన ధర జతకు రూ.80/- ప్రకారం దుస్తులు కుట్టడం కొరకు కొటేషన్ ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, పర్చేజింగ్ కమిటి చైర్మన్ గీతాంజలి శర్మ ప్రకటనలో తెలిపారు. కావున, కష్ణాజిల్లా పరిధిలోగల స్టిచ్చింగ్ ఏజెన్సీల వారు కొటేషన్ ను జిల్లా వెనుకబడిన తరగతుల, సాధికారిత అధికారి వారి కార్యాలయము, కలెక్టర్ కాంపౌండ్, మచిలీపట్నం, కష్ణాజిల్లా వారి కార్యాలయంలో ఈనెల 3వ తేదీలోపు సమర్పించాలన్నారు.

మంత్రి 'కొల్లు'ని కలిసిన దర్శకుడు మారుతి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రముఖ సినీ దర్శకుడు మారుతీ దాసరి ఆదివారం మచిలీపట్నంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రవీంద్ర ఘన విజయం సాధించి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం దక్కించుకోవడం పట్ల మారుతీ హర్షం వ్యక్తం చేశారు. రవీంద్ర నాయకత్వంలో మచిలీపట్నం మరింత అభివద్ధి సాధించగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని యాత్రికులు ఆదివారంఅధిక సంఖ్యలో దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులు తీర్చుకున్నట్లు ఆలయ కార్యనిర్వాహ ణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. ఆలయానికి విచ్చేసిన యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

పులిహోర పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : స్నేహితుని స్మతిలో సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని చల్లపల్లి వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు అన్నారు. ఆదివారం చల్లపల్లి పడమర వైపునకు చెందిన టీడీపీ కార్యకర్త సింహాద్రి యాదవ్ జనవరి నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆదివారం అతని జయంతి సందర్భంగా స్నేహితులంతా కలిసి పులిహోరా పాకెట్లు పంచిపెట్టారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైస్ ఎంపీపీ, చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షులు మోర్ల రాంబాబు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ విచ్చేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. దివంగత సింహాద్రి యాదవ్ స్నేహితులు, పెద్దలు గొరిపర్తి సుబ్బారావు, శివరామకష్ణ, సాయి కిరణ్, శ్రీరాములు, హనుమంతరావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఉయ్యూరు లయన్స్ క్లబ్ ముందంజ

ప్రజాశక్తి-ఉయ్యూరు : సేవకార్యక్రమాల్లో ఉయ్యూరు లయన్స్ క్లబ్ ముందంజలో ఉంటుందని క్లబ్ జిల్లా గవర్న ర్ ఎన్.శివశంకర్ గుప్తా కొనియాడారు. గవర్నర్ అధికార పర్యటన, క్లబ్ చేపట్టిన సేవా కార్యక్రమాల పరిశీలనలో భాగంగా ఆదివారం ఉయ్యూరు విచ్చేశారు. ఈసందర్భంగా శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల ఆవరణలో కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గవర్నర్ దంపతులు పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షునిగా ఎండి ఇస్మాయిల్ పదవీకాలంలో చేపట్టిన సేవా కార్యక్రమాల ప్రదర్శన తిలకించి కార్యవర్గాన్ని అభినందించారు. ఈసం దర్భంగా సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ దేశ విదేశాల్లో క్లబ్బు అనేక సేవాకార్యక్రమా లుచేస్తూ పేరు ప్రఖ్యాతులు గడిస్తుందన్నారు. ఉయూరు క్లబ్బు రాజోయే నూతన కార వర్గం మరిన్ని సేవాకార్యక్రమాలు చేసి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాం క్షించారు.

కుట్టు మిషన్, సైకిల్ అందజేత

గవర్నర్ అధికార పర్యటన సందర్భంగా ఉయ్యూరు క్లబ్ ఆధ్వర్యంలో శిరీషా మానసిక దివ్యాంగ బాలల ఆశ్రమంకు ఆటవస్తువులు, పేద మహిళకు కుట్టుమిషన్, యువకుల కు క్రికెట్కిట్, పేద విద్యార్థినికి సైకిల్, పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు ఆయన అందజేశారు. క్లబ్ జిల్లా క్యాబినెట్ ప్రతినిధులు నూకల వెంకట సాంబశివరావు, చెన్నారెడ్డి, జి. చక్రధర్, రీజినల్ చైర్మన్ బండి జ్యోతి, ఉయ్యూరు క్లబ్ కార్యదర్శి నల్లా శ్రీనివాస్, ట్రెజ రర్ ఊరకిషోర్, ప్రతినిధులు రావులపల్లి సుధాకర్, చింత కుటుంబరాజు, క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు నెరెళ్ల తేజసాయి వెంకట్, నెల్లి రాంబాబు, దినవహి ప్రసాద్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అందజేస్తున్న ఉయ్యూరు లయన్స్ క్లబ్ సభ్యులు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని వినతి

ప్రజాశక్తి-కంకిపాడు : సిసిఆర్సి చట్టాన్ని సవరించి, కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ పెనమలూరు శాసనసభ సభ్యులు బోడే ప్రసాద్కు కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు మాట్లాడుతూ రైతాంగం అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న 2011 కౌలు రైతుల చట్టాన్ని గత ప్రభుత్వం నిర్లక్షంగా రద్దు చేసిందని, భూ యజమాని సంతకం ఉంటేనే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని ప్రకటించిం దన్నారు. భూ యజమానులు సంతకం పెట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. దీనివలన వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి రావలసిన రైతు భరోసా, ఈక్రాప్ బుకింగ్, క్రాప్ ఇన్సూరెన్స్, పంట నష్ట పరిహారాలు, బ్యాంకు రుణాలు మొదలగునవి ఏవి అందక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గతంలో ఉన్న భూ యజమాని సంతకం నిబంధన తొలగించి గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు మాదు నాగేశ్వరరావు, పెదపూడి శ్రీనివాస్ రావు. జిల్లా సహాయ కార్యదర్శి వి మరియదాసు, యు త్రిమూర్తులు, కే రాంబాబు, పి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎంఎల్ఏకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

వంద మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ముదునూరు గ్రామపంచాయతీ, సెంటినీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి వందమందికి వైద్యపరీక్షలు చేశారు. మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన శిబిరంలో గుండె సంబంధిత 2డి ఎకో. ఈసీజీ, షుగర్, బీపీ తదితర పరీక్షలుచేశారు. టీడీపీ నాయకులు మొవ్వ జ్ఞానశేఖర్, పాలడుగు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పల్లపోతు శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. చిన్న వయస్సువారు సైతం గుండె సంబంధిత వ్యాధితో ప్రాణాలు కోల్పోతున్న నేటి పరిస్థితుల్లో ప్రతిఒక్కరు వైద్యపరీక్షలు చేయించుకునీ వైద్యుల సలహాలు పాటి ంచి ఆహార అలవాట్లు, వ్యాయామాలతో ఆరోగ్యంగా జీవించవచ్చని డాక్టర్ శ్రీపతి తెలి పారు. సెంటినీ హాస్పిటల్ వైద్య సిబ్బంది వైద్యసేవలందించారు.

సీతారామయ్య శత జయంతి

ప్రజాశక్తి-చల్లపల్లి. కమ్యూనిస్టు పార్టీలు బలహీన పడితే పౌర హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. మండల పరిధిలోని మేకావారిపాలెంకు చెందిన కమ్యూనిస్టు సీనియర్ నాయకులు మేకా సీతారామయ్య శతజయంతి వేడుకలు స్థానిక చండ్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈశ్వరయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టులు మరణించినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారన్నారు. ఏ ఇతర పార్టీలలో లేని గుర్తింపు కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఉంటుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు బతికినంత కాలం ప్రజలే తమ ఆస్తిగా బతుకుతారన్నారు. ఎల్లప్పుడూ పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. అలాంటి కోవకు చెందినవారిలో మేకా సీతారామయ్య ఒకరన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు మాలెంపాటి కాంచన రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి టి. తాతయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు నార్ల వెంకటేశ్వరరావు, వెలగపూడి ఆజాద్, రైతు నాయకులు చంద్రప్రసాద్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్ .పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటి వద్దే పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి - వత్సవాయి : జులై ఒకటో తేదీన మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా కింద ప్రభుత్వం ఇచ్చే పెన్షన్లు లబ్ధిదారులకు ఇంటి వద్ద సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ భరద్వాజ్ తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి పెన్షన్లు పంపిణీ చేయాలని కోరారు. ఒక్కొక్కరు విడివిడిగా 50కి పైగా పెన్షన్లు పంపిణీ చేయాలని అన్నారు. సిబ్బందికి ఒక్కొక్క ఏరియా నుండి ఒక్కొక్కరికి కేటాయించినట్లు తెలిపారు. వితంతువులకు, వృద్ధులకు, రూ.7వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వికలాంగులకు రూ.6 వేలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ముమ్మరంగా పత్తి సాగు

ప్రజాశక్తి - నందిగామ : వర్షాలు జోరుగా కురుస్తుండటంతో నందిగామ నియోజకవర్గంలో పత్తిసాగు ముమ్మరంగా ప్రారంభమైంది. రైతులు ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టారు. నందిగామ నియోజకవర్గంలో 34,483 హెక్టార్లు సాగవుతుంది. సుమారు 17 వేల హెక్టార్లలో పత్తి సాగు చేస్తున్నారని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే వెయ్యి హెక్టార్లలో పత్తి సాగు విత్తనాలు వేసేపనిలో రైతులున్నారు. వర్షాలు జోరుగా కురుస్తుండటంతో పత్తిసాగు చేయడంలో రైతులు బిజీగా ఉన్నారు. పత్తి విత్తనాల కోసం రైతులు విత్తనాలు షాపుల వద్ద తిరుగుతున్నారు. ఈ ఏడాది నాణ్యమైన పత్తి విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో దొరకటం లేదు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - మైలవరం : లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం, లైన్స్ క్లబ్ ఆఫ్ నరసింహారావు పాలెం ప్లాటినం క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం రాత్రి స్థానిక ఎస్వీఎస్ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లయన్ జిల్లా గవర్నర్ జె.ఎన్.శంకర్ గుప్త మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా లైనిజం ఉందని, లైన్ నిజమంటే సేవ అని సేవ ద్వారానే గుర్తింపు వస్తుందని అన్నారు. అనంతరం మైలవరం లైన్స్ క్లబ్ అధ్యక్షులుగా తిరుమల శెట్టి శ్రీధర్, సెక్రటరీగా సిహెచ్.నాగభూషణం, ట్రెజరర్‌గా నాగప్రసాద్, నరసింహారావు పాలెం క్లబ్ అధ్యక్షులుగా చెన్నారెడ్డి, సెక్రటరీగా విజయభాస్కర్ రెడ్డి, ట్రెజరర్‌గా మధుసూదన్ రెడ్డిచే ప్రమాణస్వీకారం చేయించారు. ప్రొసైడింగ్ ఆఫీసర్‌గా జాస్తి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ గవర్నర్ ఎలెక్ట్ గద్దె శేషగిరి, ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ దేవినేని కిషోర్ కుమార్, ఫాస్ట్ వాయిస్ డిస్టిక్ గవర్నర్ ఎలెక్ట్ వివిపిఎస్.ఆంజనేయులు, ఫాస్ట్ మల్టీప్లి కౌన్సిల్ చైర్ పర్సన్ ఎస్వీఎన్ నివృత్తరావు, పిఎంసిసి జిఎస్టి కోఆర్డినేటర్ ముల్పూరి ఉపేంద్ర, ప్రోగ్రాం కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సిహెచ్ బాలగోపాల్ రెడ్డి, లయన్ జిల్లా సభ్యులు, లయన్ సభ్యులు పాల్గొన్నారు.

దేవస్థానంలో వేలంపాట

జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానానికి చెందిన కౌలు భూములు మండలంలోని వేదాద్రి, రావిరాల, బండిపాలెం గ్రామంలోని '5' బిట్లుకు అనగా ఎ.16. 3వ సారి దేవస్థాన కార్యాలయంలో దేవస్థాన వంశపారం పర్యధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు ప్రతినిధి పి.రామ్ ప్రసాద్ సమక్షంలో శ్రీ వెంకమ్మ పేరంటాళ్ళామ్మ వారి కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, వెంకమ్మ పర్యవేక్షణలో సీల్డ్ టెండరు-కం-బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. భూముల కౌలు బహిరంగ వేలంలో ఎవరు పాల్గొనని కారణంగా, అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు. దేవస్థాన కేశఖండనశాలలో 2024-25 సంవత్సరంలో యాత్రికులు సమర్పించిన తలనీలాలు పోగుచేసుకొను లైసెన్సుకు సీల్డ్ టెండరులో రూ.8,64,000లకు మాత్రమే సింగిల్ టెండరు దాఖలు చేశారు. సదరు హక్కుకు బహిరంగ వేలం, ఇ-టెండరులో ఎవరు పాల్గొనకపోవటంతో జులై 6వ తేదీ వరకు వాయిదా వేసినట్లు దేవస్థాన ఇఒ శిరపరపు హేమలత దేవి తెలిపారు. వేలం పాటలు మరలా '4'వ సారి జులై 6వ తేదీ దేవస్థాన కార్యాలయంలో వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఇఒ తెలిపారు.

కనకదుర్గమ్మకు బోనాలు

ప్రజాశక్తి - నందిగామ : కనకదుర్గమ్మకు దాసరి కుల సంఘాల మహిళలు ఆదివారం బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, పట్టణ పార్టీ నాయకులు మన బోతుల శ్రీరామ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించారు.. నకిలీ విత్తనాలమ్మారు...

లబోదిబో మంటున్న రైతులు

కుళ్లిపోయిన పొత్తులు

ఎర్ర తెగులు సోగిన మొక్కజొన్న

ప్రజాశక్తి - మైలవరం : పలు మొక్కజొన్న విత్తనాల కంపెనీ ఆర్గనైజర్లు చెప్పిన మాయమాటలు నమ్మి తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడేళ్లుగా మొక్కజొన్నకు దిగుబడి రావటంతో పాటు రేటు కూడా ఉండటంతో రైతులు మొక్కజొన్న సాగువైపు మొగ్గు చూపారు. దీనిని ఆసరా చేసుకున్న పలు విత్తన కంపెనీలు రైతుల వద్దకు వెళ్లి విత్తనాలు, పెట్టుబడి తాము అందిస్తామని దిగుబడి వచ్చిన తర్వాత టన్ను 22, వేలు చొప్పున కొనుగోలు చేస్తామని రైతులకు చెప్పారు. పంట దెబ్బతిని రైతు నష్టపోతే నష్టపరిహారం కూడా చెల్లిస్తామని చెప్పటంతో మండలంలోని తోలుకోడు గ్రామానికి చెందిన రైతులు ఓబుల్ రెడ్డి దుర్గా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మహేంద్ర, భారతి మొక్కజొన్న ఆర్గనైజర్లు చెప్పిన మాటలు వినిఎకరానికి 18 వేలు కౌలు చెల్లించి 40 ఎకరాలు మొక్క జొన్న సాగు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు మండలాల్లో పలువురు రైతులు ఈ కంపెనీల విత్తనాలను నాటారు. సాధారణంగా విత్తనం నాటిన దగ్గర నుండి 3 నుంచి 4 నెలల్లో పంట చేతికి వస్తుంది. పంట చేతికొచ్చే సమయానికి మొదలలో పురుగు చేరి తెరలు తెరలుగా వచ్చి కుళ్ళిపోతుందని దీంతో దిగుబడి వచ్చిన ఎందుకు పనికిరాకుండా పంట పోతుందని దుర్గారెడ్డి వాపోతున్నాడు. మహేంద్ర, భారతి విత్తన కంపెనీ ఆర్గనైజర్లకు ఫోన్లు చేయగా వారు స్పందించడం లేదని, వారి మాయమాటలు నమ్మి తీవ్రంగా నష్టపోయామని రైతులు దుర్గారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మహేంద్ర, భారతి మొక్కజొన్న విత్తన ఆర్గనైజర్ నుండి తమకు నష్టపరిహారం ఇప్పించాలని వారు కోరుతున్నారు.

టెండర్లను రద్దు చేసి కనీస వేతనమివ్వాలి

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం గ్రామపంచాయతీలో రెండు నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని టెండర్లను రద్దుచేసి కనీస వేతనం 12 వేలు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్ డిమాండ్ చేశారు. గతంలో నిర్వహించిన టెండర్లు రద్దుచేసి పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ మైలవరం గ్రామపంచాయతీలో చేస్తున్న కార్మికులు ఆదివారం సమ్మెలోకి దిగారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల జీతాల గురించి కార్యదర్శి, సర్పంచితో చర్చించిన ఫలితం లేకుండా పోయిందని, కనీస వేతనాన్ని అమలు చేయలేని స్థితిలో పాలకులు ఉన్నారని విమర్శించారు. వెంటనే అధికారులు స్పందించి పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు వీరమ్మ, అంబటి శివ, చంద్ర రావు, మల్లీశ్వరి, రవి, భవాని, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు, సిఐటియు నాయకుడు సుధాకర్

అధ్వానంగా పారిశుధ్యం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా వుంది. ముఖ్యంగా హరిజనవాడలో మండల పరిషత్ పాఠశాల వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా వున్నాయి. రోడ్డు పక్కన చెత్త కుప్పలు, గేదెలు కట్టి వేయడంతో దుర్వాసన వెదజల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డయేరియా విజంభింస్తున్నందున నందిగామ ప్రజలు అవస్థలు పడుతున్నారు.లింగాలపాడు దళితవాడలో రోడ్డు పక్కన పెంటకుప్పలు దర్శన మిస్తున్నాయి. పెంటకుప్పలపై దోమలు విజంభిస్తున్నాయి. లింగాలపాడు-తక్కెళ్లపాడు గ్రామాలలో మద్య వున్న నల్ల వాగు పాచిపట్టి దుర్గంధ వాసన వెదజల్లుతుంది. రోడ్లు గుంటలు పడి వర్షపు నీరు నిలిచి పోయి పాదచారులు, ద్విచక్ర వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గేదెలు రోడ్డు పక్కన కట్టడంతో అపరిశుభ్రంగా ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా డయేరియా విజృంభిస్తుంది. అంటురోగాలతో ప్రజలు జ్వరాలు, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులతో ఆస్పత్రులు చుట్టు క్యూ కడుతున్నారు.

పెద్దవరం, అడవి రావులపాడు, తక్కెళ్లపాడు, సోమవరం, కమ్మవారిపాలెం, రాఘవాపురం తదితర గ్రామాల్లో పారిశుధ్యం అగమ్యగోచరంగా మారింది. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై తగు చర్యలు తీసుకోవడం లేదని గ్రామాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు పారిశుధ్యంపై దృష్టి చూపడం లేదు. మలాథియాన్, గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా వున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లింగాలపాడు గ్రామంలో పారిశుధ్యం మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కన పెంటకుప్పలు

లింగాలపాడులో అపారిశుధ్యం

వృద్ధునికి ట్రై సైకిల్ పంపిణీ

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, పొట్టి శ్రీరాములు సేవా ట్రస్ట్ చైర్మన్ బొగ్గవరపు వెంకట రాజారావు, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ ఎంఎల్‌సి తొండపు జనార్ధన్ వృద్ధునికి రూ.10 వేల విలువైన ట్రైసైకిల్ అందజేశారు. మండల ప్రముఖ నాయకులు వడ్లమూడి రాంబాబు, జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం కార్యవర్గ కమిటీ సభ్యులు పెరుమాళ్ళ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న బిసి కాలనీ వాసులు

రోడ్డు కోసం ఆందోళన

ప్రజాశక్తి - వీరులపాడు : 50 సంవత్సరాలు నుండి బిసి కాలనీలోని 15 కుటుంబాల వారు ఇదే రోడ్డుపై తమ అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు. రోడ్డు సమీప సరిహద్దు రైతులు తమ భూములను అక్రమంగా రోడ్డుకు ఉపయోగించారంటూ సమీప రైతులు జెసిబితో రోడ్డును ధ్వంసం చేశారని గ్రామస్తులు వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. లేకుంటే ఆందోళన చేపడతామని చింతల గోపి వెంకటేశ్వరరావు నాగేంద్రమ్మ ఆందోళన కార్యక్రమం చేపట్టారు.

తిరుపతమ్మను దర్శించుకున్న భట్టి

పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అధికారులు ఆయనను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మొక్కులు అనంతరం ఆయనను ఆలయ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు అమ్మవారి మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ చెన్న కేశవరావు, జన సేన నాయకులు లగడపాటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర సంగమంలో హారతి తిరిగి కొనసాగించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంఘంలో గతంలో మాదిరిగా హారతి కార్యక్రమాలను తిరిగి కొనసాగించాలని కోరుతూ మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌కు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీ కుమారి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవిత్ర సంగమ ప్రాంతం పవిత్రతను కోల్పోయిందని ప్రస్తుతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని తెలిపారు. రాబోయే రోజుల్లో పుష్కరాలు కూడా దగ్గరలో ఉన్న కారణంగా మరింతగా పవిత్ర సంగమాన్ని మెరుగుపరిచి, మరల హారతి కార్యక్రమాన్ని కొనసాగించాలని, తద్వారా చిరు వ్యాపారులకు ఉపాధి దొరుకుతుందని ఎంఎల్‌ఎను కోరినట్లు తెలిపారు.

కౌలు రైతుల కష్టాలు తీరేదెన్నడో...

- భూ ఆధీకృత కౌలు రైతుల చట్టం-2011 అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కౌలు రైతులు వ్యవసాయ సాగుకు పెట్టుబడుల వేటలో తన మునకలవుతున్నారు. ఈనేపథ్యంలో నూతనంగా రాష్ట్రంలో ఏర్పాటు అయిన కూటమి ప్రభుత్వంపై అనేక ఆశలతో కౌలు రైతులు ఎదురు చూపులు చూస్తున్నారు. కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల రక్షణ కోసం 'ఆంధ్ర ప్రదేశ్ భూ ఆధీకత కౌలు రైతుల చట్టం (2011)'ను తీసుకువచ్చి అమలు చేశారు. ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం భూ యజమానితో సంబంధం లేకుండా ప్రభుత్వమే గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి, కౌలు రైతులను గుర్తించి, వారి ద్వారా దరఖాస్తులు స్వీకరించి, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసేవారు. ఈ గుర్తింపు కార్డునే లోను ఎలిజిబులిటీ (ఎల్ ఇ సి) కార్డు అని అనేవారు. ఈ గుర్తింపు కార్డుతో అన్ని రకాల బ్యాంకుల వద్ద స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరాకు 34 వేల రూపాయలు రుణం పొందేవారు. బ్యాంకు వారు ఈ రుణాలను మంజూరు చేసి 11 మాసాలలో తిరిగి చెల్లించాలనే నిభందనలు చేసేవారు. అదేవిధంగా కౌలు రైతులు ఋణాలు చెల్లించేవారు. దీని ద్వారా కౌలు రైతులకు వ్యవసాయం సాగు చేయటం సులభతరంగా ఉండేది. ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వం భూ ఆధీకత రైతుల చట్టం (2011)లో మార్పులు చేసింది. ఈ మార్పుతో కౌలు రైతుల కష్టాలు ప్రారంభమైయ్యాయి. తప్పనిసరిగా భూ యజమాని అనుమతి ఉంటేనే కౌలు రైతుకు గుర్తింపు కార్డు ఇవ్వాలి అనే నిబంధనను విధించింది. దీనివల్ల అనేకమంది భూ యజమానులు అంగీకరించకపోవడంతో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక వడ్డీ కి రుణం తీసుకుని వ్యవసాయం చేయటం అనివార్యంగా మారింది. దీనివల్ల అధిక వడ్డీల భారం కౌలు రైతులకు శాపంగా మారింది. దీనితో కౌలు రైతు అనివార్యంగా నష్టాలను చవి చూడవలసి వస్తోంది. అంతేకాక దీనివల్ల ఈ క్రాఫ్ నమోదులో కూడా కౌలు రైతు పేరు కాకుండా భూ యజమాని పేరు నమోదు కావడంతో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, రైతు భరోసా,ధాన్యం అమ్మకాలు, ధాన్యం అమ్మకాలు ద్వారా వచ్చే నగదు అన్నీ భూ యజమాని ద్వారానే కొనసాగుతున్న పరిస్థితి ఉంది. ఈ విధానాన్ని నిలువరించే ఏకైక మార్గం 2011 కౌలు దారీ చట్టాన్ని యదావిధిగా అమలు చేయడం మాత్రమే. రెవెన్యూ రికార్డులలో కౌలు రైతు పేరు నమోదు అయితేనే ఈక్రాప్ నమోదు అవుతుంది. సబ్సిడీ విత్తనాలు, రైతు భరోసా, ధాన్యం అమ్మకాలు లాంటి అన్నింటిలోనూ స్వతహాగా కౌలు రైతు ముందుకు సాగాలని, దానికి అనుగుణంగా నూతన ప్రభుత్వం చట్టాన్ని అమలు చేయాలని కౌలు రైతులు, కౌలు రైతు సంఘం కోరుకుంటున్నారు.

ఎంఎల్ఎ బుద్ధప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న అర్చకులు

అర్చకుల పేరు మీద రసీదులు జారీ చేయాలని వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్రంలోని దేవాదాయ శాఖ పరిధిలోని దేవాలయాలలో అర్చకుల ఆధీనంలో గల ఆలయ భూములకు అర్చకుల పేరుని భూమిశిస్తు రసీదులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్ష సమాఖ్య ప్రతినిధులు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్కు వినతి పత్రం అందజేశారు. సమైక్య ప్రతినిధులు దివి రామకష్ణ చార్యులు వాసుదేవ సీతారామకష్ణ కుమారాచార్యులు, బాలకష్ణ ఆచార్యుల,ు లక్ష్మీ దాశరధి బందావనం, అనంత రామాచార్యులతో కూడిన బందం ఆదివారం బుద్ధ ప్రసాదును ఆయన స్వగహంలో కలసి రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి తమ ద్వారా వినతి పత్రం అందజేయవలసిందిగా కోరారు. అనుభవదారులైన అర్చకులకు భూమిశిస్తు రసీదులు ఇవ్వరాదని గత ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో ఆలయ భూములపై ఉన్న హక్కులను అర్చకులు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలు దేవాలయాల పూజారులు పాల్గొన్నారు

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్ : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ, సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యర్శి రామ అజయ్ అన్నారు. నగరంలో గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. నూతన ప్రభుత్వం తమ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి అన్నారు.ఈ సందర్భంగా ఎస్. టి., ఎస్. టి., కమిషన్ మాజీ సభ్యులు కొండా రెడ్డి నరహరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరిం చాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బి.పాండు రంగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాజేష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సుదర్శన్, జాయింట్ సెక్రటరీ శశి కళ తదితరులు పాల్గొన్నారు.

సువర్ణరాజు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నాగాయలంక మండలం చిన్న ఏటిమొగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో సువర్ణ రాజు సేవలు అభినందనీయమని పలు ఉపాధ్యా యులు కొనియాడారు. ఆదివారం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలానికి చెందిన పలువు ఉపాధ్యాయులు పాల్గొని సువర్ణ రాజును సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో విద్యార్థులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్న వారిలో సువర్ణ రాజు కూడా ఒకరన్నారు. 14 సంవత్సరాల పాటు ఒకే గ్రామంలో ఒకే స్కూల్లో పనిచేయడం అరుదైన సంఘటనని అటువంటి గౌరవం సువర్ణరాజుకు దక్కిందన్నారు. ఈ సందర్భంగా సువర్ణ రాజును గ్రామ విద్య కుటుంబం పేరుతో ప్రశంసా పత్రంతో సత్కరించడంతోపాటు ఆయనను పూలదండలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు డిజి గోపాలకష్ణ, డి నిరీక్షణ రావు, పిఆర్‌టియు నాయకులు జి వి ఎస్ పెరుమాళ్ళు, ఆయా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు మాదివాడ వామనమూర్తి పండు, బుజ్జిబాబు, కైలా శ్యాంబాబు, వాణి డి జీవన్ జయరాం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ కాంతారావు తదితరులు పాల్గొని సువర్ణ రాజును ఘనంగా సత్కరించారు

సుమతికుమారికి సత్కారం



ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని నిమ్మగడ్డ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కైలా సుమతికుమారి పదవీ విరమణ కార్యక్రమం పాఠశాల ప్రాంగణం లో ఆదివారం జరిగింది. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి- 2 పరిశె వెంకటేశ్వరరావు హెచ్‌ఎం సుమతికుమారి- చెరుకూరి రాఘవులు దంపతులకు పూలమాలవేసి సత్కరించారు. గ్రామ స్థులు సుమతికుమారి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పురిటిగడ్డ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కెబిఎన్ శర్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ పి ప్రశాంతి, పాస్టర్ సంగీతరావు పాల్గొన్నారు.

కైతేపల్లి దాస్ కు సన్మానం

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు కైతేపల్లి దాస్ కు ఆదివారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా సన్మానించారు. ప్రజాసంఘాల నేతలు, దళితసంఘాల నేతలు పాల్గొని దాస్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రముకులు అడ్డాడ ప్రసాద్ బాబు, దాసి సీతారామరాజు, అడపా గురవయ్య, బుల్లా కిషోర్, ఉప్పాల సాంబశివరావు, నర్రా చిన్ని, మాతంగి నరసింహారావు, శంకర్రావు, నర్రా చిన్ని, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-చల్లపల్లి : ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించగా నేత్ర వైద్యులు మోహన్ రావు కంటి పరీక్షలు జరిపారు. ఈ శిబిరంలో 100 మందిని పరీక్షించగా 30 మందికి శుక్లం ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి మంగళవారం విజయవాడ అమరావతి హాస్పి టల్‌లో ఆపరేషన్ చేసి బుధవారం చల్లపల్లి వాసవి క్లబ్ ఆఫీస్ కి తీసుకువస్తామని నిర్వాహకులు తెలిపారు. వారికి అవసరమైన మందులు ఉచితంగా వాసవి క్లబ్ ద్వారా అందజేస్తామని తెలిపారు.

ఉప్పరగూడెంలో విషాదఛాయలు

నాగరాజు (ఫైల్)

ప్రజాశక్తి-పెదన : జవాన్‌గా శ్రీనగర్‌లో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన నాగరాజు (32) స్వగ్రామం పెదన మండలం ఉప్పరగూడెంలో విషాదచాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని ఉప్పరగూడెంకు చెందిన వెంకన్నకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో నాగరాజు పది సంవత్సరాల క్రితం ఆర్మీకి ఎంపియ్యాడు. ప్రస్తుతం శ్రీనగర్‌లోని లఢక్‌లో పనిచేస్తున్నారు. శనివారం లడక్‌లో ఓ వాగు దాటే సయమంలో నీటి ఒరవడికి నాగరాజు కొట్టుకుపోయారు. ఆయనకు నాలుగు సంవత్సరాల క్రితమే మంగాదేవితో వివాహం జరిగింది. మంగాదేవి ఉరివి సచివాలయంలోని మహిళ పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఏడాది పాప కూడా ఉంది.

నేడు అంత్యక్రియలు : నాగరాజు మతదేహం సోమవారం స్వగ్రామమైన ఉప్పరగూడెనికి చేరుకోనుంది. ప్రభుత్వాం ఛనంగా అంత్యక్రియలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పింఛన్ల పంపిణీ విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా సోమవారం నుంచి చేపట్టనున్న పింఛన్ల పంపిణీలో అవనిగడ్డ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉండేలా అధికార యంత్రాంగం సమిష్టి కషి చేయాలని, అందుకు ప్రజా ప్రతినిధుల కోసం ఎదురు చూడరాదని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ సూచించారు. ఆదివారం ఆయన కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ పంపిణీ కార్యక్రమం వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అందుకు సిబ్బంది అధికారులు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. పంపిణీ కార్యక్రమాన్ని గ్రామాల వారిగా అధికారులు సిబ్బంది సకాలంలో ప్రారంభించి విజయవంతం చేయాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ వేగవంతంగా నిర్వహించి అవనిగడ్డ నియోజకవర్గం కష్ణాజిల్లాలో మొదటి స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : వద్ధులకు, వితంతువులకు ఏడు వేల రూపాయలు చొప్పున, వికలాంగులకు 6000 రూపాయల చొప్పన సోమవారం ఉదయం 6 గంటల నుండి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయాలని ఎండిఒ షేక్ సుభాని అన్నారు. ఆదివారం ఆయన సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మొదటి తారీఖునే పింఛన్ల పంపిణీ పూర్తవ్వాలన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. **జగ్గయ్యపేట:** సామాజిక పెన్షన్ విధానానికి ఆద్యుడు స్వర్గీయ ఎన్టీఆర్ పేరును పెన్షన్ల కార్యక్రమానికి పెట్టారని, ఎన్టీఆర్ భరోసా పేరుతో ఇకపై మీ ఇంటి వద్దకొచ్చి సామాజిక పెన్షన్ల పంపిణీ చేస్తారని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. ఆదివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో రాజగోపాల్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మ్యానిఫెస్టోలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పినట్లు పెన్షన్‌ను ఒకేసారి రూ. వెయ్యి రూపాయలు పెంచారన్నారు. పెన్షన్ల పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు అదనంగా రూ.819 కోట్ల భారం పడుతుందని, ప్రజా శ్రేయస్సు కోసం ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియం కమిటి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్షిప్ 2024 నేషనల్ సెలక్షన్స్ టోర్నమెంట్ కు రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల ఆటల పోటీలను ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురామ్ ప్రారంభించారు. అనంతరం ఈ ఆటలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, నూజివీడు నియోజకవర్గ పరిశీలకుడు గింజుపల్లి రమేష్, కళ్యాణం సూర్యప్రకాష్ ఇండోర్ స్టేడియం మేనేజర్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మేడూరు సీతారామయ్య పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో సంతాన సాఫల్యత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సాధారణంగా పిల్లలు కలగలేదంటే స్త్రీలోనే లోపం ఉందని భావించే ఈ ప్రపంచంలో అత్యాధునిక సంతానసాఫల్యతా వైద్య చికిత్సా విధానాలతో నూటికి 50పై చిలుకు సందర్భాలలో భర్తలో వీర్యకణాల లోపమే సంతానలేమికి కారణమని స్త్రీ సంబంధిత వ్యాధులు, ఫెర్టిలిటీ నిపుణులు డాక్టర్ కొల్లి రమాదేవి అన్నారు. డాక్టర్సడే సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. పిల్లలులేని దంపతులలో సగంమందికి పురుషుల్లో వీర్యకణాల్లో లోపం మాత్రమే ఉంటుందన్నారు. వీర్యకణాల సంఖ్య 20 మిలియన్ల కన్నా తక్కువగా ఉండటం, వీటిలో కదలికలు ఉండే కణాలు 50 శాతం కన్నా తక్కువగా ఉండటం, ముందుకు కదిలే వీర్యకణాలు 25 శాతం కన్నా తక్కువగా ఉండటం, సారూప్యత కలిగిన వీర్యకణాలు 30 శాతం కన్నా తక్కువగా ఉండటం వల్ల స్త్రీలలో ఎటువంటి లోపం లేకపోయినా గర్భం రాదన్నారు. వీర్యకణాలు ఇలా ఉండటానికి టెస్టిస్లో లోపాలుగానీ, వీర్యకణాల ఉత్పత్తిలో తేడాలు గానీ ఉండవచ్చని వివరించారు.

వీర్యకణాల్లో లోపాలు-కారణాలు : వృత్తి పనిలో అలవాట్లు బాగా ఉష్ణోగ్రత కలిగిన ప్రదేశాల్లో పనిచేసే వారిలో, పురుగులమందులను వినియోగించే వారిలో, రేడియేషన్, కీమోథెరఫీ వంటి చికిత్సలు పొందిన వారిలో, స్టెరాయిడ్స్ ఎక్కువగా తీసుకునే వారిలో, పౌష్టికాహార లోపం ఉన్నవారిలో, ధూమపానానికి తదితర అలవాట్లు ఉన్నవారిలో వీర్యకణాల లోపం ఉండవచ్చు.

పుట్టుకతో లోపాలు : పుట్టుకతోనే టెస్టిస్ నిర్మాణం సరిగా జరగకపోయినా, సరిగా కిందకు రాకపోయినా, క్రోమోజోమ్స్ తేడాలు ఉండటం, వీర్యకణాల ఉత్పత్తి మధ్య దశలోనే ఆగిపోతుండటం వంటి కారణాలవల్ల కూడా వీర్యకణాలలో లోపాలు ఏర్పడతాయని తెలిపారు.

హార్మోన్లలో తేడాలు : హర్మోన్ల స్థాయి తక్కువగా ఉండటం, ఇతర ఎండోక్రైన్స్ కారణాల వల్ల కూడా వీర్యకణాలలో లోపం ఏర్పడవచ్చన్నారు.

మరే ఇతర వ్యాధులు ఉన్నా : కిడ్నీ ఫెయిల్యూర్, సిరోసిస్ సికిల్సలేమియా, వెన్నుపాముకు దెబ్బతగలడం, లివర్సిగోసిస్ వంటి వ్యాధులతో బాటు స్పెర్మ్ ప్రయాణమార్గంలో అడ్డంకులు ఏర్పడటం కూడా వీర్యకణాలలో లోపాలకు కారణాలన్నారు.

ఆధునిక చికిత్సలు : వీర్యకణాలలో లోపాలకు కారణాలు ఏమైనప్పటికీ మందులు, ఆపరేషన్(వేరికోసిల్, స్పెర్మ్ ప్రయాణమార్గంలో అడ్డంకులను తొలగించేందుకు) వంటి చికిత్సల వల్ల వీర్యకణాల సంఖ్య పెరగకపోయినట్లయితే సంతాన సాఫల్యతా సహాయతా విధానాలు (ఎఆర్‌టి) పొందవలసి ఉంటుందన్నారు. **ఐయుఐ ట్రీట్మెంట్** :వీర్యకణాలలో లోపాలు మరీ ఎక్కువగా లేనట్లయితే ఐయుఐ విధానం ద్వారా సంతానప్రాప్తికి ప్రయత్నించొచ్చన్నారు. **ఐవిఎఫ్ ట్రీట్మెంట్ :** వీర్యకణాల సంఖ్య 10 నుంచి 20 మిలియన్ల మధ్యలో ఉన్నట్లయితే ఐయుఐ విధానం అయిదారు సార్లు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేనప్పుడు ఐవిఎఫ్ విధానం ప్రయత్నించవచ్చన్నారు. **ఐసిఎస్ఐ ట్రీట్మెంట్ :** వీర్యకణాల సంఖ్య 5 మిలియన్లకన్నా తక్కువగా ఉన్నప్పుడు, వీర్యకణాల కదలికలు బాగా నెమ్మదిగా ఉన్నప్పుడు, వీర్యకణాల సారూప్యతలో తేడాలు ఉన్నప్పుడు, యాంటీ స్పెర్మ్, యాంటీబాడీస్ ఉన్నప్పుడు నేరుగా ఐసిఎస్ఐ ట్రీట్మెంట్ పొందాలన్నారు.

స్త్రీ సంబంధిత వ్యాధులు, ఫెర్టిలిటీ నిపుణులు డాక్టర్ కొల్లి రమాదేవి

టిఇఎస్ఎ ట్రీట్మెంట్ : వీర్యకణాల ఉత్పత్తి తక్కువగా జరుగుతున్నప్పుడు లేదా పూర్తిస్థాయిలో (హైపో స్పెర్మిటోజెనెసిస్) ఉత్పత్తి జరగనప్పుడు కూడా భర్త వీర్యకణాల ద్వారానే సంతానం పొందే అవకాశాన్ని అత్యాధునిక చికిత్సా విధానమైన టిఇఎస్‌ల-ఐసిఎస్ఐ ద్వారా పొందొచ్చన్నారు.

ట్రయోటీసీ : ఈ విధానంలో వషణాల నుంచి తీసిన టెస్టిక్యులార్ బయాప్సీని లేదా దాని నుంచి సేకరించిన స్పెర్మిటోజోవాను గానీ క్రయోప్రిజర్వేషన్ చేసి భద్రపరుస్తారు. దానిని చికిత్స సమయంలో అవసరానికి అనుగుణంగా ఉపయోగిస్తామని తెలిపారు.

డోనార్ ఇన్సెమినేషన్ : వీర్యకణాలు అస్సలు లేనప్పుడు, దాత వీర్యకణాలతో సంతానసాఫల్యత పొందవచ్చన్నారు. చాలా సందర్భాల్లో సంతానలేమికి స్త్రీ ఒక్కతే కారణం అని భావించకుండా భార్యభర్తలిద్దరూ పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు.

రొమ్ము కేన్సర్‌కు ఎఒఐలో చికిత్స విజయవంతం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : గుంటూరుకు చెందిన 42 ఏళ్ల మహిళ తీవ్ర స్థాయి రొమ్ము కేన్సర్‌తో బాధపడుతుండగా ఆమెకు విజయవంతమైన చికిత్సను చేసినట్లు అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఏవోఐ) మెడికల్ అంకాల జిస్ట్ డాక్టర్ సృజన జోగా తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.. గత ఆరు నెలలుగా కుడి రొమ్ములో కేన్సర్ కణితితో ఆమె ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆమెను పరిశీలించిన తర్వాత, బయాప్సీ నిర్వహించామని, అక్కడ ఆమెకు డక్టల్ కార్సినోమా, ఒక రకమైన రొమ్ము కేన్సర్‌గా నిర్ధారణ అయిందన్నారు. తీవ్రస్థాయి స్టేజి 3బి ట్రిపుల్-నెగటివ్ బ్రెస్ట్ కేన్సర్ అన్నారు. నియో అడ్జువాంట్ కెమోథెరపీని ప్రారంభించామని అన్నారు. కీమోథెరపీ తర్వాత అల్ట్రాసౌండ్‌లో ఎటువంటి కణితి లేదని వెల్లడైందన్నారు. కీమోథెరపీ, శస్త్రచికిత్స తర్వాత రోగి పూర్తి ప్రతిస్పందన మంచి రోగ నిరూపణను నిర్ధారిస్తుందని తెలిపారు. ఎఒఐ మంగళగిరి ఆర్‌సిఒఒ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ కేసులో తమ వైద్య బృందం ప్రదర్శించిన నైపుణ్యం, అంకితభావం అసాధారణమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడంలో మా నిబద్ధతను నొక్కి చెబుతున్నాయన్నారు.

ప్రారంభ కార్యక్రమంలో మహిళలు

ఆర్‌ఆర్‌ఆర్ క్రియేషన్స్‌తో మహిళలకు ఉపాధి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆర్యవైశ్య ఆంధ్రప్రదేశ్ మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సెల్ఫ్ ఎంప్లాయి మెంట్ స్కీమ్ చైర్ పర్సన్‌గా మద్దుల రేవతి బలరాం ఆదివారం నూతనంగా ప్రమాణస్వీకారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల ఉపాధి కలిగి తన కాళ్ళ మీద తను నిలబడి ఉండాలన్నారు. అందుకోసమే అర్ అర్ ఆర్ క్రియేషన్స్ పేరుతో సంస్థను స్థాపించి ఉపాధి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉపాధి కల్పించేందుకే అర్ అర్ ఆర్ క్రియేషన్స్ పేరుతో గత సంవత్సర కాలంగా అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం 14 మందితో ప్రారంభమైన ఈ సంస్థ భవిష్యత్తులో వంద మందికి ఉపాధి కల్పించేలా తీర్చిదిద్దామని తెలిపారు. అర్‌అర్‌ఆర్ క్రియేషన్స్ ఫౌండర్ రూపా రేణుక మాట్లాడుతూ అర్ అర్ ఆర్ క్రియేషన్స్ అంటే హ్యాండ్ మేడ్ విత్ లవ్ అనే లోగోతో వివాహాది శుభకార్యాలకు మన సంస్కృతి సాంప్రదాయాలకు తగ్గట్టుగా అవసరమైన అన్నిటిని బార్బీ బొమ్మలు రూపంలో తాము అందిస్తామన్నారు. అనంతరం అర్‌అర్‌ఆర్ క్రియేషన్స్ సభ్యులు దీపిక, రత్న, లక్ష్మీ, నాగమణి, పావని, జస్మితరెడ్డి, అంజలి, సౌజన్య, రేఖా రాణి లు ఆర్యవైశ్య సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ చైర్ పర్సన్‌గా ఎంపికైన మద్దుల రేవతి బలరాంకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రి రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు ఆదివారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. వైద్య చికిత్స సక్రమంగా అందుతుందా లేదా అని అయన రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగాలకు సంబంధించి ఆయా చికిత్సలకు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయా, లేవా వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణం శుభ్రంగా ఉండాలని, రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదని ఎమ్మెల్యే వైద్యులకు సూచించారు.

ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

నీజెన్ డయాగ్నోస్టిక్స్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : మహా నగరాలకు మాత్రమే పరిమితమైన అత్యున్నత శ్రేణి డయాగ్నోస్టిక్ సేవలను ప్రజలందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నీజెన్ డయాగ్నోస్టిక్స్ ఆదివారం లాంఛనంగా ఆరంభమైంది. ప్రకాశం రోడ్డులోని నీజెన్ డయాగ్నోస్టిక్స్‌ను రెయిన్ బో హాస్పిటల్స్ సీఎండీ రమేష్ కంచర్ల ప్రారంభించారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా, ప్రపంచ స్థాయి వ్యాధి నిర్ధారణ వ్యవస్థగా నీజెన్ సేవలందించనుంది. ఈ సందర్భంగా, రెయిన్ బో హాస్పిటల్స్ సీఎండీ రమేష్ కంచర్ల మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి డయాగ్నోస్టిక్ సేవలను నగరంలో అందుబాటులోకి తేవడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి అత్యాధునిక రిఫరల్ ల్యాబ్, స్పెషాలిటీ ల్యాబ్స్, జినోమిక్స్.. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు ఉపకరిస్తాయని రమేష్ కంచర్ల తెలిపారు. అనంతరం, నీజెన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రామ్ ప్రకాష్ మాట్లాడుతూ.. నిర్దిష్ట కాల వ్యవధిలో, అత్యంత కచ్చితంగా పరీక్షల ఫలితాలను అందిస్తామని చెప్పారు. మెట్రో నగరాల్లోని ల్యాబ్ ల నుంచి ఫలితాల కోసం రోజుల తరబడి వేచిచూడాల్సిన అవసరం లేకుండా, అత్యాధునిక సాధనా సంపత్తి, నిష్ణాతులైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, క్లినికల్ బందాలతో నీజెన్ రూపుదిద్దుకుందని తెలియజేశారు. రిపోర్టులు వేగంగా అందజేయడం ద్వారా అత్యవసర స్థితిలో ఉన్న పేషెంట్లకు త్వరితగతిన చికిత్సలు అందించేందుకు అవకాశం లభిస్తుందని అన్నారు. నీజెన్‌లోని జినోమిక్స్ విభాగం ద్వారా, జన్యు సంబంధిత విశ్లేషణలు జరిపి భవిష్యత్తులో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను ఇప్పుడే తెలుసుకోవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పవర్ మెక్ ప్రాజెక్ట్ సీఎండీ సజ్జా కిషోర్ బాబు, నగరంలోని పలువురు వైద్య ప్రముఖులు, అంతర్జాతీయ డయాగ్నోస్టిక్స్ సాధన సంపత్తి ఉత్పత్తి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

తిరువూరు విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - తిరువూరు : జనవిజ్ఞానవేదిక తిరువూరు ప్రాంత సభ్యుడు జి.సురేంద్ర నాథ్ ఏపీ పీజీ సెట్ (ఇంగ్లీష్)లో 100 మార్కులకు గానూ 76 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 36వ ర్యాంక్ సాధించాడు. క్రమ శిక్షణతో చదివితే ఇటువంటి ఫలితాలను సొంతం చేసుకోవచ్చని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ అన్నారు. ఈ సంద్భంగా గంగాధర్, జనవిజ్ఞానవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.హరికృష్ణ, జిల్లా కార్యదర్శి ఎం.రాంప్రదీప్, తిరువూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు దుబ్బాకు సుదర్శన్, మోదుగు సుధాకర్, కడిమి పాపారావు, పి.శీనయ్య, ఎస్‌డి.సుభానీ తదితరులు అభినందనలు తెలిపారు.

గుండె, ఎముకల వ్యాధుల మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ మోహన్‌రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ ట్రామా సెంటర్‌లో డాక్టర్ మోహన్‌రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ ట్రామా సెంటర్ వారి ఆధ్వర్యంలో ఆదివారం గుండె ఎముకల వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి డాక్టర్ మామిడి సీతారామారావు (ఎంబిబిఎస్, డిఎన్‌బి సర్జన్) అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి నాయకులు జంపాల సీతారామయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంపాల సీతారామయ్య మాట్లాడుతూ డాక్టర్ మోహన్‌రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ ట్రామా సెంటర్ ఇబ్రహీంపట్నం వారు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంలోని సేవల్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. డాక్టర్ మోహన్‌రావు మెమోరియల్ ట్రస్ట్ చేస్తున్న సేవలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు స్థానికులు పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ మామిడి రత్నమోహన్‌రావు, డాక్టర్ తబీష్ సయ్యద్ రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఇసిజి ఆర్.బి.ఎస్, క్రియేటిన్ హెచ్.పి.ఎ.ఐ.సి ఎక్సరే ఆర్‌ఎండి తదితర వైద్య పరీక్షలు 100 మందికి పైగా చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.పల్లవి, ఎస్.పూర్ణిమ, శ్రావ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

లైజాల్ నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇంటి పరిసర ప్రాంతాల్లో క్రిముల బారి నుండి సంరక్షించుకునేందుకుగానూ లైజాల్ సరికొత్త ఫినైల్ ఉత్పత్తులను ఆవిష్కరించినట్లు సంస్థ ఇన్‌ఛార్జి కె.ప్రతాప్ తెలిపారు. నూతన ఉత్పత్తుల పరిచయ కార్యక్రమం నగరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిని శుభ్రం చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ ఇటీవల లైజాల్ ఫినైల్ బ్రాండ్ ఉత్పత్తులను ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా వీటి గురించి విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడతో పలు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.